ప్రజాశక్తి

ఆదివారం 27 అక్టోబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





సర్దుపోటు

- విద్యుత్ వినియోగదారులపై నెలకు రూ.4.94 కోట్ల అదనపు భారం
- 15 నెలలకు రూ.74.12 కోట్లు



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఇప్పటికే భారీగా పెరిగిన నిత్యావసరాలు, పెట్రోల్, గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపేందుకు పూనుకుంది. గత ప్రభుత్వం మోపిన విధంగానే కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు భారం మోపడానికి సిద్ధపడింది. 15 నెలలపాటు ఈ సర్దుబాటు భారాన్ని వినియోగదారులు మోయాల్సి ఉంటుంది. 2026 జనవరి వరకు వినియోగదారులు ఈ అదనపు భారాన్ని మోయాల్సి ఉంటుంది.

వినియోగదారులపై రూ.74.12 కోట్లపైనే భారం

కృష్ణాజిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఎపిసిపిడిసిఎల్) పరిధిలో ఒక యూనిట్‌కు సగటున రూ.0.83 పైసలు అదనపు భారం పడనుంది. ఒక్కో నెలలో ఒక్కో విధంగా ఈ మొత్తాన్ని వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేస్తారు. కృష్ణాజిల్లాలో 7,36,602 విద్యుత్ కనెక్షన్లున్నాయి. గృహ విద్యుత్ కనెక్షన్లు 5,36,744 ఉన్నాయి. సగటున 5 కోట్ల 95 లక్షల 35 వేల 043 యూనిట్ల మేర గృహ విద్యుత్ వినియోగం జరుగుతోంది. యూనిట్‌కు 0.83 పైసల చొప్పున నెలకు 4 కోట్ల 94 లక్షల 14 వేల రూపాయల భారం వినియోగదారులపై అదనంగా పడనుంది. మొత్తం 15 నెలలకు పరిశీలించినప్పుడు 74 కోట్ల 12 లక్షల 11 వేల రూపాయల పడుతుంది. స్లాబుల వారీగా ఎంత వ్యత్యాసం ఉంటుందనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రభుత్వం మారినా తప్పని విద్యుత్ సర్దు'పోటు'

ప్రభుత్వాలు మారినా వినియోగదారులకు విద్యుత్ షాక్ తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలోనూ సర్దుబాటు ఛార్జీలను ప్రజలపై భారీగా మోపారు. ఈనేపథ్యంలో తాము అధికారంలోకొస్తే విద్యుత్ భారాలు మోపబోమని కూటమి నేతలు ఎన్నికల్లో ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాలుగు నెలలకే వినియోగదారులకు షాక్ ఇచ్చారు. 2022 ఏప్రిల్‌లో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ అప్ ఛార్జీలను ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో వసూలు చేయనున్నారు. 2022 మే ఖర్చును 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో వసూలు చేస్తారు. ఇదేవిధంగా వరుసగా 15 నెలల పాటు వినియోగదారులు భారం మోయాల్సిన దుస్థితి నెలకొంది.



విజయవాడలో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు బాబురావు, కాశీనాథ్ తదితరులు


విద్యుత్ భారాలపై ఉద్యమం ఉధృతం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు హెచ్చరిక
- విజయవాడలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా
- నియంత్రణ మండలి ఉత్తర్వుల కాపీలు దహనం

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ భారాలను రద్దు చేసి స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. రూ.6072 కోట్ల విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం విజయవాడ నగర కమిటీల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. విద్యుత్ భారాలపై నిరసన తెలిపారు. "విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం వద్దు...వద్దు, విద్యుత్ భారాలపై మాట తప్పిన కూటమి ప్రభుత్వం, విద్యుత్ భారాలు తగ్గించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం" అంటూ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈసందర్భంగా విద్యుత్ నియంత్రణ మండలి ఉత్తర్వుల కాపీలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ దారిలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తూ ప్రజలపై భారాలు మోపడం ప్రారంభించిందన్నారు. నాలుగు నెలల్లో సూపర్ సిక్స్, ఇతర హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం... ప్రజలపై భారాలను మోపటంలో మాత్రం ముందుందని విమర్శించారు. విద్యుత్, ఇతర రూపాల్లో ప్రజల నెత్తిన భారాలు మోపిన గత వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించారని గుర్తుచేశారు. బడా కంపెనీలకు దోచిపెట్టి భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన వైసిపి ప్రభుత్వ అక్రమాలపై విచారించి శిక్షించాల్సింది పోయి, ఆ భారాలకు కూటమి ఆమోదముద్రవేసి ప్రజలపై రుద్దడం దారుణమన్నారు. హిందూజా, అదానీ, శిరిడీసాయి(మిగతా 2లో)


తూర్పు బైపాస్‌కు త్వరలో టెండర్లు?

మార్చిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం !



బైపాస్ రోడ్డు ఊహాచిత్రం

ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడ తూర్పు అవుటర్ బైపాస్ రోడ్డు పనులు అతి త్వరలో పట్టాలెక్కబోతున్నట్లు తెలిసింది. ఈ రోడ్డు నిర్మాణం కోసం జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) డిపిఆర్ రూపకల్పనకు టెండర్లు పిలిచింది. ఈ టెండర్లను దక్కించుకున్న చైతన్య కన్సల్టెన్సీ అనే సంస్థ డిపిఆర్ రూపొందించి తుదిరూపుకు తీసుకొచ్చినట్లు తెలిసింది. డిపిఆర్ ఫైనల్ అయిన తర్వాత ఈ బైపాస్ రోడ్డు పనులు చేపట్టేందుకు 2025 జనవరిలో టెండర్లు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలిసింది. వచ్చే ఏడాది మార్చికి బైపాస్ పనులు ప్రారంభమవుతాయని తెలిసింది. కష్ణాజిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు మొత్తం 49.3 కిలోమీటర్ల మేర తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే ఆమోదం లభించింది. దీనిలో భాగంగా కష్ణానదిపై 3.7 కిలోమీటర్ల వంతెన కూడా నిర్మించనున్నారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు వ్యయం రూ.4,608 కోట్లు, నిర్మాణ వ్యయం రూ.2,215.48 కోట్లు అవుతుందని అంచనా. ముందుగా తూర్పు బైపాస్ 40 కిలోమీటర్లు మేర ఉంటుందని భావించగా.. ఆ తర్వాత నాలుగు మార్గాలను పరిశీలించారు. దీనిలో 49.3 కిలోమీటర్ల ఎలైన్‌మెంటుకు ఎన్‌హెచ్ ఆమోదం తెలిపే వీలుందని తెలిసింది. దాదాపు ఖరారైన ఎలైన్‌మెంటు కష్ణాజిల్లా పరిధిలో 29.5 కిలోమీటర్లు, గుంటూరు జిల్లా పరిధిలో 19.7 కిలోమీటర్లు మేర ఉంటుంది. 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించేందుకు వీలుగా నాలుగు వరుసలుగా దీనిని నిర్మిస్తారు. భవిష్యత్తులో ఆరు వరుసలకు విస్తరించేందుకు వీలుగా 60 మీటర్ల వెడల్పుతో ఎలైన్‌మెంటు ఖరారు చేస్తున్నారు. ఇందుకుగాను మొత్తం 295 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుందని అంచనా. బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా కష్ణానదిపై వంతెనతోపాటు 22 ప్రధాన వంతెనలు, 2 ఆర్ఒబిలు, ఒక ఫ్లైఓవర్, 2 ఇంటర్‌ఛేంజ్‌లు నిర్మించేలా ప్రతిపాదిస్తున్నారు. ఈ రోడ్డు కష్ణాజిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లోని ఆత్కూరు, పెదఅవుటపల్లి, అల్లాపురం, బూతిమిల్లిపాడు, తెన్నేరు, తరిగొప్పుల, మారేడుమాక, కోమటిగుంట, మానికొండ, కోలవెన్ను, దావులూరు, నెప్పల్లి, చలివేంద్రపాలెం, బొడ్డపాడు, రొయ్యూరు గ్రామాల మీదుగా వెళ్లనుంది. అక్కడినుంచి కష్ణానది వంతెన దాటాక గుంటూరు జిల్లాలో కొల్లిపొర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని వల్లభాపురం, పేరకలపూడి, చుక్కపల్లివారిపాలెం, మోరంపూడి, చిలువూరు, తుమ్మపూడి, చినకాకాని, కాజ గ్రామాల మీదగా ఎన్‌హెచ్-16లో కలుస్తుంది. తరిగొప్పుల, మోరంపూడి వద్ద రైల్వేలైన్లు, దావులూరు వద్ద మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి మీదగా తూర్పుబైపాస్ వెళ్లేలా ఎలైన్‌మెంటు రూపొందించారు. ఇప్పటికే విజయవాడకు పశ్చిమవైపు కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని చిన్నఅవుటపల్లి నుంచి విజయవాడ సమీపంలోని గొల్లపూడి మీదుగా గుంటూరు జిల్లా కాజ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టిన విషయం తెలిసింది. దీని నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. ఇది వచ్చే ఏడాదిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



బైపాస్ రోడ్డు మ్యాప్

సిఎంతో ఎంపి శివనాథ్ భేటీ

- పలు సమస్యలపై వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - విజయవాడ :

మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎంపి కేశినేని శివనాథ్ శనివారం కలిశారు. విజయవాడలోని పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేసి ఆ సమస్యలను వివరించారు. పశ్చిమ నియోజకవర్గంలోని ఓల్డ్ రాజరాజేశ్వరి పేట ప్రాంతంలో రైల్వే శాఖకు చెందిన స్థలంలో నివాసం వుంటున్న నివాసితులు పదిహేను రోజుల్లోగా ఖాళీ చేయాలని రైల్వే అధికారులు చాటింపు వేయించారని, తమ ఇళ్లు కూల్చి వేసి ఖాళీ చేయిస్తారని బాధితులు ఆందోళన పడుతున్నారని తెలిపారు. తక్షణం కూల్చివేత చర్యలు నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవటం తోపాటు...ఆ తర్వాత ఈ సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో లాజిస్టిక్ పార్క్ అభివద్ధి కోసం ఆసక్తి చూపిన ఆ స్థలాన్ని ఎన్‌హెచ్ఏఐకి అందజేయడానికి ఏపీసీఆర్‌డీఏకు అవసరమైన భూమిని అప్పగించవలసిందిగా ఏపీజెన్‌కోను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు అంశాలపై సిఎం సానుకూలంగా స్పందించారు.



సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరిస్తున్న ఎంపి కేశినేని శివనాథ్

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలోని ఐసిడిఎస్ ప్రోజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకురాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు విజయవాడ రూరల్, అర్బన్ ప్రోజెక్టుల సీడీపీవోలు జి.మంగమ్మ, టి.నాగమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని విజయవాడ (రూరల్) ప్రాజెక్ట్ పరిధిలో రాయనపాడు -3లో ఎస్సీ కేటగిరి, 11వ డివిజన్ జార్జిపేట అంగన్వాడీ కేంద్రాల్లో ఓసి అంగన్వాడీ కార్యకర్త పోస్టులను, 5వ డివిజన్ వరలక్ష్మి నగర్ మినీ అంగన్వాడీ కేంద్రంలో ఓసి కేటగిరిలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టును, నున్న-10, రామవరప్పాడు-9 అంగన్వాడీ కేంద్రాలలో ఎస్సీ, రామవరప్పాడు-5, 16వ డివిజన్ మధుసూధన నగర్, గుణదల -4 అంగన్వాడీ కేంద్రాల్లో ఓసి, 22వ డివిజన్ భ్రమరాంబపురం అంగన్వాడీ కేంద్రంలో బీసీ-డి కేటగిరిలో అంగన్వాడీ సహాయకురాలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు రూరల్ ప్రాజెక్ట్ సీడీపీవో జి. మంగమ్మ తెలిపారు. అలాగే విజయవాడ అర్బన్ పరిధిలోని 35వ డివిజన్ పేజొనిపేట-3లో ఎస్సీ, 38వ డివిజన్ గుప్తా సెంటర్‌లో బీసీ-బి, 40వ డివిజన్ నులకపేట-2లో ఓసీ, 43వ డివిజన్ యు.ఎస్.నగర్-4లో ఓసి, 44వ డివిజన్ పేర్రాజు చెరువు-2లో ఓసి, 55వ డివిజన్ వించిపేట-6లో బీసీ-ఈ, 24వ డివిజన్ కస్తూరిబాయిపేటలో ఎస్సీ, 25వ డివిజన్ కొత్త వంతెన-2లో ఓసి, 32వ డివిజన్ ఆర్.ఎల్ పేట-1లో ఓసీ, 32వ డివిజన్ ఆర్. ఎల్ పీట-2లో ఎస్సీ, 36వ డివిజన్ వేంకటేశ్వర మన్యంలో ఓసి, 58వ డివిజన్ సింగ్ నగర్-9లో ఓసి, 58వ డివిజన్ అజిత్ సింగ్ నగర్-12లో బిసి-బి, 59వ డివిజన్ లూనా సెంటర్- 3లో బీసీ-ఎ, 59వ డివిజన్ ఎస్‌సి, ఎస్.టి కాలనీలో ఎస్టీ, 60వ డివిజన్ వాంబే కాలనీ-1లో బిసి-ఏ, 60వ డివిజన్ వాంబే కాలనీ-15లో ఓసి, 60వ డివిజన్ వాంబే కాలనీ-16లో ఓసి, 60వ డివిజన్ వాంబే కాలనీ-20లో ఓసి, 63వ డివిజన్ రాజీవ్ నగర్ 7లో ఓసీ ఆర్థికంగా బలహీన వర్గం కేటగిరీలో అంగన్వాడి సహాయకురాలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు అర్బన్ ప్రాజెక్ట్ సిడిపివో టి.నాగమణి తెలిపారు. ఈ పోస్టులకు జులై 1, 2020 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహితరాలు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థినులు అంగన్వాడి ఆయా పోస్టులకు కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్‌లను దరఖాస్తు ఫారమ్‌తో జత చేసి నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కానూరులోని సిడిపిఒ విజయవాడ రూరల్, అర్బన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని సిడిపిఒలు జి.మంగమ్మ, టి.నాగమణి తెలిపారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో సంయుక్త పరిశీలన చేస్తేనే ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం వివిధ శాఖాధిపతులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సంయుక్త పరిశీలన ద్వారా వ్యర్థాలు, సి అండ్ డి వేస్ట్ తొలగించడం, తాగునీటి పైప్లైయిన్ మరమ్మతులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు సత్వరమే పరిష్కరించవచ్చని అన్నారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో కూడా పట్టణ ప్రణాళిక శానిటరీ, ఎమినిటీస్ సెక్రటరీలు ప్రతిరోజు సంయుక్త పరిశీలన చేసి ప్రజల సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా మహిళాభివద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో 22 ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థులు నవంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ జిల్లా అధికారి జి.ఉమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసీపీఎస్ (డీసీపీయూ) యూనిట్‌లో ఒక అకౌంటెంట్, ఒక డేటా అనలిస్ట్, ఎస్‌ఏఏ యూనిట్‌లో ఒక మేనేజర్/కోఆర్డినేటర్, ఒక ఏఎన్‌ఎం (నర్స్), ఒక పార్ట్‌టైం డాక్టర్, ఒక చౌకీదార్ (వాచ్ ఉమెన్), నాలుగు ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. చిల్డ్రన్ హోమ్స్‌లో ఒక స్టోర్‌కీపర్ కమ్ అకౌంటెంట్, ఒక ఎడ్యుకేటర్ (పార్ట్‌టైమ్), రెండు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్ (పార్ట్‌టైమ్), రెండు పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్ (పార్ట్‌టైమ్), ఒక కుక్ (అవుట్ సోర్సింగ్), రెండు హెల్పర్ (అవుట్ సోర్సింగ్), రెండు హౌస్ కీపర్, ఒక ఉమెన్ హెల్పర్ కమ్ నైట్ వాచ్‌ఉమెన్ ఖాళీలను కూడా భర్తీ చేయనున్నట్లు వివరించారు. స్థానిక అర్హులైన 18-42 ఏళ్ల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అయిదేళ్లు, వికలాంగులకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుందని తెలిపారు. ntr.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్లోడ్ చేసుకొని, గజిటెడ్ ఆఫీసర్ అటెస్టెడ్ ధ్రువపత్రాల నకళ్లను జతచేసి మహిళాభివద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, డోర్ నెం. 6-93, కార్మెల్ చర్చి ఎదురురోడ్, కానూరు, విజయవాడకు స్వయంగా సమర్పించాలని జి.ఉమాదేవి సూచించారు.



మెప్మా అర్బన్ మార్కెట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - విజయవాడ : స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకానికి విజయవాడ నగరపాలక సంస్థ యుసిడి విభాగం ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్స్ సమీపంలోని అనుగ్రహ దేవి గుడి వద్ద, పటమట రైతు బజార్ వద్ద శనివారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్‌ను ఇన్చార్జి పిఒ యుసిడి, జాయింట్ డైరెక్టర్ అమత్ సందర్శించారు.

28 నుండి ఎపి స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుత జాబ్ మార్కెట్లో మంచి ప్రాముఖ్యత కలిగిన డెస్కాప్ పబ్లిషింగ్ (డిటిపి), సిగ్నేజ్ సొల్యూషన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సుపై ఈనెల 28 నుండి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు తెలిపారు. ఈకోర్సులకు అడాబ్ ఫొటోషాప్, కొరల్డ్రాల్ ఉపయోగించి డెస్కటాప్ పబ్లిషింగ్ (డిటిపి), సంకేతాల రూపకల్పన నేర్పిస్తారని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

విద్యుత్ భారాలపై ఉద్యమం ఉధృతం

ఎలక్ట్రికల్ తదితర కంపెనీలకు పాలకులు దాసోహం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 -23లో వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు ఒక్కో యూనిట్‌కు అదనంగా 85 పైసల మేర భారం మోపి, ఈ ఏడాది నవంబర్ నుండి 2026 జనవరి వరకు 15 నెలలపాటు వసూలు చేయాలని నిర్ణయించడం అక్రమమన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను, గహాలకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన తెలుగుదేశం కూటమి నేడు ఆ మీటర్లు బిగించడానికి పూనుకోవడం మోసపూరితమన్నారు. ఇప్పటికే రెండు రకాల ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను వసూలు చేస్తున్నారని, వీటికి మరో సర్దుబాటు ఛార్జీలు తోడు చేయటం ప్రజలను పీల్చిపిప్పి చేయటమే అవుతుందన్నారు. ఒక్కో యూనిట్‌కు అన్ని రకాల సర్దుబాటు ఛార్జీలు కలిసి రూ.2 వరకు వసూలు చేయటం దారుణమన్నారు. అసలు ఛార్జీల కంటే కొసరు ఛార్జీలే అధికంగా ఉంటున్నాయన్నారు. బడా కంపెనీల దోపిడీ, పాలకులు, అధికారుల అవినీతి, అసమర్థ విధానాలే ఈ భారాలకు కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2000లో ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజల ఆగ్రహానికి గురైన విషయాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. వాటి నుండి గుణ పాఠాలు నేర్చుకోకుండా చంద్రబాబు ప్రభుత్వం... కేంద్రం అండతో కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవటం క్షంతవ్యం కాదన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో కూటమి ప్రభుత్వం కపట నాటకం ఆడుతోందన్నారు. ఈ భారాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే విద్యుత్ నియంత్రణ మండలి మోపిన భారాన్ని ప్రభుత్వమే భరిస్తామని ప్రకటించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాజకీయాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్, పశ్చిమ సిటీల కార్యదర్శులు భూపతి రమణరావు, బోయి సత్యబాబు, తూర్పు సిటీ కమిటీ ఇన్చార్జి పి.కృష్ణ, నగర నాయకులు కె.దుర్గారావు, టి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 4 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కృష్ణా జిల్లా, విజయవాడ కోర్టులో

O.S. No. 2008/2022

Between :
Union Bank of India, Bharathinagar Branch, Vijayawada, Rep. by its Senior Branch Manager.
... Petitioner / Plaintiff

And
1) Mrs. Sai Leela Kumari Pudiyakonda,
W/o. Mohan Rao, Hindu, Aged about 45 years, D.No. 5-52, Kanuru, Penamaluru Mandal, Krishna District.
... Respondents / Defendants

టు, పై దాఖలా మీకు అనగా **Mrs. Sai Leela Kumari Pudiyakonda,** W/o. Mohan Rao, Hindu, Aged about 45 years, D.No. 5-52, Kanuru, Penamaluru Mandal, Krishna District. ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తం తేది : 30-12-2024 నకు వాయిదా అయిఉన్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదురు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారాగానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల పై దావాలో మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

(ది. 23-10-2024 నాటి శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 30-12-2024

బొద్దనపల్లి నరేంద్ర, న్యాయవాది, విజయవాడ
ఫ్లాట్ నెం. 3ఎఫ్-3, 3వ అంతస్తు,
సాయి తవనేష్ టవర్స్, రామమందిరం వీధి, గవర్నర్‌పేట,
విజయవాడ - 520002.
ఫోన్ : 8790172192, 7013986863

మహారాజశ్రీ 4 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కృష్ణా జిల్లా, విజయవాడ కోర్టులో

O.S. No. 90/2022

Between :
Union Bank of India, Bharathinagar Branch, Vijayawada, Rep. by its Senior Branch Manager.
... Petitioner / Plaintiff

And
1) M/s. Padma Fashions Rep. by its Proprietor : B. Nagalakshmi, D.No. 42-44-7, Luna Center, Ajithsingh Nagar, Vijayawada - 520015.
2. Bhima Nagalakshmi, W/o. Bhargav, Hindu, Aged about 35 years, D.No. 42-44-7, Luna Center, Ajithsingh Nagar, Vijayawada - 520015.
3. Bhima Bhargav, S/o. Not known, Hindu, aged about 40 years, D.No. 42-44-7, Luna Center, Ajithsingh Nagar, Vijayawada - 520015
... Respondents / Defendants

టు, పై దాఖలా మీకు అనగా **1) M/s. Padma Fashions** Rep. by its Proprietor : B. Nagalakshmi, D.No. 42-44-7, Luna Center, Ajithsingh Nagar, Vijayawada - 520015. **2. Bhima Nagalakshmi,** W/o. Bhargav, Hindu, Aged about 35 years, D.No. 42-44-7, Luna Center, Ajithsingh Nagar, Vijayawada - 520015. **3. Bhima Bhargav,** S/o. Not known, Hindu, aged about 40 years, D.No. 42-44-7, Luna Center, Ajithsingh Nagar, Vijayawada - 520015 ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తం తేది : 15-11-2024 నకు వాయిదా అయిఉన్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదురు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారాగానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల పై దావాలో మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

(ది. 25-09-2024 నాటి శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 15-11-2024

బొద్దనపల్లి నరేంద్ర, న్యాయవాది, విజయవాడ
ఫ్లాట్ నెం. 3ఎఫ్-3, 3వ అంతస్తు,
సాయి తవనేష్ టవర్స్, రామమందిరం వీధి, గవర్నర్‌పేట,
విజయవాడ - 520002.
ఫోన్ : 8790172192, 7013986863

మహారాజశ్రీ 3 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, విజయవాడ కోర్టులో

O.S. No. 573/2022

Between :
Union Bank of India, Bharathinagar Branch, Vijayawada, Rep. by its Senior Branch Manager.
... Petitioner / Plaintiff

And
1) Mr. Sundarada Venkata Ramana, S/o. Venkat, Hindu, Aged about 35 years, Business, R/o. D.No. 32-11-4-6, RCM Church Road, Moghalrajpuram, Vijayawada, Krishna Dist.
2) S. Gowramma, W/o. Venkat, Hindu, Aged about 50 years, Business, R/o. D.No. 32-11-4-6, RCM Church Road, Moghalrajpuram, Vijayawada, Krishna Dist.
... Respondents / Defendants

టు, పై దాఖలా మీకు అనగా **1) Mr. Sundarada Venkata Ramana,** S/o. Venkat, Hindu, Aged about 35 years, Business, R/o. D.No. 32-11-4-6, RCM Church Road, Moghalrajpuram, Vijayawada, Krishna Dist. **2) S. Gowramma,** W/o. Venkat, Hindu, Aged about 50 years, Business, R/o. D.No. 32-11-4-6, RCM Church Road, Moghalrajpuram, Vijayawada, Krishna Dist. ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తం తేది : 15-11-2024 నకు వాయిదా అయిఉన్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదురు మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారాగానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల పై దావాలో మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

(ది. 27-09-2024 నాటి శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : 15-11-2024

బొద్దనపల్లి నరేంద్ర, న్యాయవాది, విజయవాడ
ఫ్లాట్ నెం. 3ఎఫ్-3, 3వ అంతస్తు,
సాయి తవనేష్ టవర్స్, రామమందిరం వీధి, గవర్నర్‌పేట,
విజయవాడ - 520002.
ఫోన్ : 8790172192, 7013986863

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE□S (JUNIOR DIVISION) COURT, GUDIVADA

E.P. NO.36/2021 IN A.C.P. NO. 23/2013

Between :
Margadarsi Chit Fund (P) Ltd., Rep. by its Branch Manager - cum - Foreman, Gudivada .... D.H.R.
And
Mr. Gude Venkata Ramana & others ...JDRs

3rd JDR : Bandi Venkata Subrahmanyam, S/o B.Chinna Rao, R/o D.No. 2/54/1A, E-Seva Back side Street, Pamarru Road, Gudivada, Krishna District.

పై నెంబరు అమలులో 3rd JDR తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 11-11-2024వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు బహిరంగ వేలము జరుగునని తెలియజేయటమైనది. కావున వేలం పాటలో పాల్గొనువారు వేలంపాటలో పాల్గొనవచ్చును.

3rd JDR Schedule : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వారి యిలాకా గుడివాడ మున్సిపాలిటీ ఏరియాలోని 2వ వార్డులో 3rd JDR కు సంక్రమించిన నేటివరకు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తాధికారములు కలిగి రీ సర్వే నెం. 88-2ఎ1ఎరు, చు॥గ॥ 69.90 ల స్థలము, సదరు స్థలములో గల అసెస్‌మెంట్ నెం. 1068000566 రు, డోర్ నెం.2/54-1ఎ రు గల గ్రౌండ్, ఫస్ట్ మరియు సెకండ్ ఫ్లోర్‌లుగా గల ఆర్‌సిసి మేడ భవంతిలో దక్షిణం వైపున భాగము వగైరాల ఆస్తికి ఐటమ్ నెం.1కి హద్దులు :
తూర్పు : మున్సిపల్ సందు బజారు
దక్షిణం : బండి వెంకట పాండు రంగారావు వగైరాలకు యీ ఆస్తిని జాయింటు హక్కులుగల ఇంటి గోడ వగైరా.
పడమర : మానికొండ రామారావు, మానికొండ భాస్కరరావు, మానికొండ వెంకట్రావు గార్ల ఆస్తి.
ఉత్తరం : బి.చిట్టిబాబు వాటాకు రాబడిన బిల్డింగులోని భాగము
డిహెచ్ఆర్ వాల్యూ : రూ.2,00,000/-
అమీనా వాల్యూ : రూ.5,00,000/-

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వేలం వాయిదా : 11-11-2024
ఫరదర్ హియరింగ్ : 18-11-2024

ఇట్లు
శ్రీ కొడాలి హరినాథ్,
అడ్వకేట్, గుడివాడ.

ప్రకటన

నా క్లయింటు అయిన చోడవరపు సుబ్బారావు మరియు చోడవరపు లక్ష్మి, నివాసం : డోర్‌నెం. 43-146-20ఎ, కె.ఎల్.రావు రోడ్డు, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-15 వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా :

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేల్పూరి భూషయ్య గారి కుమారులు 1) వేల్పూరి వసంతరావు 2) వేల్పూరి హరిబాబు, నివాసం : తోటవారివీధి, నందమూరి నగర్, విజయవాడ వారి వద్ద నుండి దిగువ దాఖలా షెడ్యూలు ఆస్తి కొనుగోలు చేయుటకు అగ్రిమెంటు కుదుర్చుకుని వున్నారు. మరియు వారి వద్ద నుండి సక్రమమైన విక్రయ దస్తావేజును పొందుటకు సిద్దంగా వున్నారు. కావున నా క్లయింటు దిగువ ఆస్తిపై క్రయ దస్తావేజు పొందుటకు ఎవరికైన ఏ అభ్యంతరములు గానీ, కోర్టు అటాచ్‌మెంట్లు గాని, తనఖాలు గాని, భాగలబ్ది తగాదాలు గానీ ఉన్న యెడల వారి అభ్యంతరములు ఈ క్రింది అడ్రస్సునకు ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో రిజిష్టర్డ్ పోస్టు ద్వారా తెలియజేయగలరు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు గానీ, క్లయిములుగానీ నా క్లయింటున బైండు చేయజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూల్

యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ అర్బన్ మండలం, విజయవాడ విలేజిపోర్షన్ ఆర్.ఎస్.నెం. 23/2 న్యూ మున్సిపల్ వార్డు నెం.16, పాత అసిస్మెంట్ నెం.18698/40సి, దరిమిలా 142536, ప్రస్తుత అసిస్మెంట్ నెం. 10730 62637, నందమూరినగర్, తోటావారివీధి, డోర్ నెం.43-106/1-145రు దాఖలా స్థిరాస్థి నివేశన స్థలమునకు హద్దులు:
తూర్పు : కలిదిండి వెంకట సుబ్బలక్ష్మి గారి ఆస్థి.
అ. 29.00 అం. లు
దక్షిణం : 6 అడుగుల జాయింటు దారి కొంత వరకు షేక్ షరీఫ్ ఉద్దీన్ గారి 1వ అయిటం ఆస్థి కొంత వరకు అ.44.1-1/2అం.లు
పడమర : షేక్ అల్లాభక్షి గారి 1వ అయిటం ఆస్థి .29.00 అం.లు
ఉత్తరం : సాగి పరమేశ్వరమ్మ గార అస్థి
అ. 44.1-1/2 అం.లు

ఈ హద్దుల మధ్య చ.గ.143.77 స్థిరాస్థి నివేశన స్థలమున్నూ, ఎ.సి.సి. కప్పుతో నిర్మించి యున్నట్టి రెండు షెడ్డులున్నూ.

పై స్థిరాస్తిలోనికి రాకపోకల నిమిత్తం దక్షిణం మున్సిపల్ రోడ్డు నుండి 6 అడుగుల నడకదారి.

ఎం.డి.ప్రభాకర్, ఎం.కాం., ఎం.ఎల్.,
అడ్వకేట్,
డోర్ నెం. 31-16-30,
బుల్లెమ్మవీధి, మాచవరం,
విజయవాడ-4. సెల్ నెం: 92900 55959

పాపవినాశనంలో అక్రమంగా ఇసుక తరలింపు

- పడవల్లో ఇసుక తీసుకువచ్చి ట్రాక్టర్లలో డంపింగ్

ప్రజాశక్తి ఘంటసాల : రాష్ట్ర ప్రభుత్వం ఘంటసాల మండలం పాపవినాశనం ఇసుక రీచ్ కు ఎలాంటి అనుమతులు ఇవ్వకపోయినా ట్రాక్టర్ డ్రైవర్లు కష్ణానదిలో పడవలలో ఇసుకను తీసుకుని వచ్చి ట్రాక్టర్లలో డంపింగ్ చేస్తున్నారు. శనివారం ఉదయం ఈ సంఘటన జరుగుతుండగా, ఇదేమిటని ప్రశ్నించిన గ్రామస్తులపై ట్రాక్టర్ డ్రైవర్లు ఇష్టం వచ్చినట్టు మాట్లాడారు. పాపవినాశనం క్వారీకి అనుమతులు వచ్చాయని, మా ఇష్టం వచ్చినట్టు తీసుకెళ్తామని ఆపేదెవరో చూస్తామని గ్రామస్తులపై ఎదురు తిరిగారు. ఎడ్లబండ్లకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ ట్రాక్టర్లు కృష్ణా నది రేవులోకి వెళ్లడానికి ఎలాంటి అనుమతులు లేవని ఘంటసాల తాసిల్దారు విజయప్రసాద్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కష్ణానదిలోకి పడవలను తీసుకుని వెళ్లి ఇసకను తీసుకువచ్చి ట్రాక్టర్లను తరలిస్తున్న వైనం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తోలుకునే అవకాశం మాకు ఉందని ఈ విషయం అధికారులకు సైతం తెలుసని, అడగడానికి మీరు ఎవరని పాప వినాశనం గ్రామస్తులతో దురుసుగా మాట్లాడుతూ ట్రాక్టర్ డ్రైవర్లు బరితెగించి ప్రవర్తిస్తున్నారు. సుమారు పాపవినాశనం రేవు వద్ద 25 ట్రాక్టర్లు నిలిచి ఉండటంతో తీవ్ర ఉద్రిక్తి ఏర్పడింది. ఈ విషయమై సంఘటన స్థలానికి వెళ్లిన స్థానిక పాత్రికేయలు ఫోటోలు తీస్తుంటే ఎందుకు తీస్తున్నారని ఆడ్డుకునే ప్రయత్నం చేసారు. ఈ విషయమై ఆర్డిఓ, మండల స్థాయి తహసిల్దార్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టి, నదిలో పడవలతో ఇసుక తరలించే వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పడవల నుంచి ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

బైక్ ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-కంకిపాడు : మండల పరిధిలోని గోసాల సెంటర్లో రోడ్డుపై నిలబడిన జొన్న గంటి లక్ష్మీపతిరావు (67)ను వేగంగా బైక్‌పై వచ్చిన వ్యక్తి ఢీకొన్నాడు. లక్ష్మీపతిరావు తలకు తీవ్ర గాయాలవ్వగా 108 అంబులెన్స్‌లో విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకొని వెళ్ళగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చల్లపల్లిలో ఆటో దగ్ధం

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని నారాయణరావు నగర్‌లో గోవాడ నాగార్జునకు చెందిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం తెల్లవారు జామున పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. శుక్రవారం రాత్రి ఇంటిముందు ఆటోను పార్కింగ్ చేశారు. కావాలనే తన ఆటోను దగ్ధం చేసారని నాగార్జున తెలిపారు., చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు.



దగ్ధమైన ఆటో

టపాసుల విక్రయంలో జాగ్రత్తలు పాటించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-ఉయ్యూరు : దీపావళి పండుగకు టపాసుల విక్రయించే షాపుల వద్ద ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని ఉయ్యూరు ఆర్డీవో బిఎస్ హెలా షారోన్ అన్నారు. టపాసుల షాపులు విక్రయించేందుకు కేటాయించిన వీరమ్మ ఆలయ ప్రాంగణాన్ని శనివారం తహసీల్దార్ సురేశ్ కుమార్ తో కలసి పరిశీలించి పలుసూచనలు చేశారు. షాపుల వద్ద ఏర్పాటు చేయవలసిన అగ్నిమాపక పరికరాలు ఇతర అంశాలను షాపుల వారికి వివ రించారు. ఉయ్యూరు కమిషనర్ పి. వెంకటేశ్వరరావు, సీఐ రామారావు, ఎస్సై విశ్వనాథ్, అగ్నిమాపక అధికారి రవితేజ ఇతర అధికారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రంగారావు

28న కంకిపాడు-మానికొండ రోడ్డు బాగు చేయాలని పాదయాత్ర : సిపిఎం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు, మానికొండ, గుడివాడ రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆరోడ్డును బాగు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు అన్నారు. కంకిపాడు మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం వేలాది వాహనాలు నడిచే ఈ రహదారిలో ఎటు చూసినా గోతులతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుం దోనని వాహనదారులు ఆందోళన పడుతున్నారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వెళ్లడానికి కూడా ఇది ప్రధాన రహదారిగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయికానీ, రోడ్డు నిర్మాణం మాత్రం జరగటం లేదన్నారు. రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతూ ఈనెల 28వ తేదీన కోమటికుంట లాకు నుండి, మానికొండ మీదగా, గుడివాడ వరకు పాదయాత్ర జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని వారు కోరారు. కంకిపాడు మండల కార్యదర్శి టి నరేష్, సీనియర్ నాయకులు కె నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ 6 లక్షల 48 వేల 069 సహాయ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పరిధిలోకి రాని వైద్య సేవలు పొందిన పేదలకు అండగా నిలిచేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మెయిన్ కాలువకు దాళ్వా పంటకు నీరు ఇప్పించాలని, 2020 సంవత్సరం ఆగస్టు సెప్టెంబర్ నెలలో కురిసిన వడగల్లు వానకు దెబ్బతిన్న వరి పొలాలకే నష్టపరిహారం ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో పెడన ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం శనివారం అందించారు. అన్నదాత సుఖీభవ మొత్తం ఇరవై వేల రూపాయలు రైతులకు, కౌలు రైతులకు ఇప్పించాలని, చోరంపూడి కాల్వపై గతంలో ఉన్న స్థానంలో డ్రాప్ పునః నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, సిఐటియు నాయకులు మాజీటీ శ్రీనివాస రావు, బంటుమిల్లి రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, గౌరీ శెట్టి నారాయణ, కన్నారావు, గౌరిశెట్టి చిట్టోడు, కొల్లా విశ్వనాథం, ఆరేపల్లి రమణ, ఎస్ నాగరాజు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ముగిసిన ఉపాధి శిక్షణ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో అక్టోబర్ 21న మొదలైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ విజయకుమారి తెలిపారు. విద్యార్థులకు ఈ వారం రోజుల పాటు జావా, పైతాన్ వంటి వాటిలో కోడింగ్ తరగతులను వర్సిటీ తరపునుండి విద్యార్థుల తరుపున ఎటువంటి ఖర్చు లేకుండా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఆర్. శ్రీనివాసరావు చొరవతో ఏర్పాటు చేసినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. టాలెంట్ షైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నుండి ఉదయ్ అనే కోడింగ్, ప్రోగ్రామింగ్ నిపుణుడు ఇంజనీరింగ్‌లోని ఈసీఈ, సిఎస్ఈ విద్యార్థులతో పాటు ఎంసీఏ, ఎంటెక్ విద్యార్థులకు కూడా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన పైతాన్, జావా వంటి కోడింగ్ నైపుణ్యాలను నేడున్న పోటీ పరీక్షలకి సరిపోయేవిధంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. సోమవారం శిక్షణా తరగతుల ప్రాంగణానికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు విచ్చేసి విద్యార్థులను ఈ వారం రోజుల తరగతులు ఉపయోగకరంగా ఉన్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో టెక్నికల్ విద్యార్థులకు శిక్షణ తరగతుల ఆవశ్యకతను వివరించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : వికలాంగ విద్యార్థులకు ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అనేక పథకాలు కల్పిస్తుందని సమగ్ర శిక్ష కష్ణా జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ యస్.రాంబాబు అన్నారు. పాఠశాలకు హాజరు కాలేని వికలాంగ విద్యార్థులకు సహిత విద్య ఉపాధ్యాయులు ప్రతి శనివారం గహ సందర్శన చేసి కత్యాధార బోధనను చేసే కార్యక్రమంలో భాగంగా మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలోని వికలాంగ విద్యార్థి ఇంటిని సందర్శన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపీ, అలవెన్సులు, మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ లు నిర్వహించి ఉపకరణాల పంపిణీ, ట్యాబ్‌ల ద్వారా బోధన వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సమగ్ర శిక్ష ఏపిఓ కె.ఏడుకొండలు, ఐ.ఈ.ఆర్పీ అబ్దుల్ హమీద్ లు పాల్గొన్నారు.

నైపుణ్య గణనకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో నైపుణ్య గణనకు పటిష్టవంతమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారులు, గ్రామ వార్డు సచివాలయ అధికారులతో శనివారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి, జిల్లాలోని ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో నిర్వహించు నైపుణ్య గణనపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నైపుణ్య గణన తొలుత పైలట్ ప్రాజెక్టుగా మంగళగిరిలో నిర్వహించారని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నారని, అక్కడ నైపుణ్య గణనలో పనిచేసిన వారు మాస్టర్ ట్రైనర్లుగా జిల్లాలో మండల స్థాయిలో సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. . ఈనెల 29న మండల స్థాయిలో శిక్షణకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి డేటా సేకరించి, వారికి ఏ ఏ అర్హతలు ఉన్నాయి, ఏ శిక్షణ ఇస్తే వారికి ఉపాధి లభిస్తుందో ఆ విధంగా వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. ఇందుకోసం మొబైల్ యాప్ డిజైన్ చేశారని, దీని అనుసరించి డేటా సేకరించవలసి ఉంటుందన్నారు. సేకరించిన డేటా విశ్లేషించి ఉపాధి శిక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు. జాయింట్ కలెక్టర్ ఈ కార్యక్రమం అమలు నోడల్ అధికారిగా ఉంటారన్నారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ నరేష్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ రవికాంత్ పాల్గొన్నారు



వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-కోడూరు : వాహనదారులు తమ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నియమాలు పాటించాలని, లేకపోతే జరిమానాలు విధిస్తామని కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు. శనివారం సాయంత్రం కోడూరు ప్రధాన సెంటర్లో వాహనాలు తనిఖీలను సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని వారికి జరిమానా విధించి మాట్లాడారు. వాహనాలు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ఆటో డ్రైవర్లు కూడా పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ఆటోలు ట్రాక్టర్ నడిపేటప్పుడు లౌడ్ స్పీకర్‌లు పెట్టవద్దని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా రహదారి భద్రత సూచనలను పాటించాలన్నారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలని ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ భారాలు ఉపసంహరిం చాలని శనివారం ఆందోళన శనివారం నిర్వహించారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సిపిఎం నాయకుడు బర్రె లెనిన్ డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై రూ.6012 కోట్ల విద్యుత్ భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ఈ ఆలోచన విధానాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. మాదు భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎఇకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లపై శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన, మెరుగైన సేవలను అందించటానికి కషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకష్ణ, పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.



ప్రదర్శనను చూస్తున్న సిపి రాజశేఖరబాబు, తదితరులు



పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్

ప్రజాశక్తి - విజయవడ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల్లో భాగంగా సిటీ ఆర్మ్ డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో రెండు రోజులు పాటు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం జిల్లా నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి పావురాలను, బెలూన్లను ఎగురవేసి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ అక్టోబర్ 21వ తేదీకి ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరులను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో అధునిక పద్ధతిలో ఉపయోగిస్తున్న ఆయుధాలు, సైబర్ క్రైమ్ నేరాలను ఏవిధంగా ఛేదిస్తున్నాము అనేది హౌస్ ముఖ్య ఉద్దేశమన్నారు. తీవ్రవాదులు, మావోయిస్టులను ఎదుర్కోవటంలో ఏ విధమైన సాధనాలు, అయుధాలను పోలీసు వారు ఉపయోగించి ముందుకు వెళ్తున్నామనేది సమాజంలోని ప్రజలకు, యువతకు, విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాల్లో ఆయుధాలను వాహనాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ వింగ్‌కు సంబంధించిన పరికరాలు, ఫింగర్ ప్రింట్ బ్యూరో విధానాన్ని వివరిస్తున్నట్లు తెలిపారు. సిటీ ఆర్మ్ రిజర్వ్ గ్రౌండ్లో ఏర్పాటుచేసిన ఓపెన్ హౌస్ లో ఆక్టోపస్ బందాలు ఉపయోగించు సాధనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి, బి.డి. (బాంబ్ నిర్వీర్యం) బృందాలు, డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు, బాడీ వాన్ కెమెరాలు, వివిధ రకాల ఆయుధాల పనితీరు, ఎన్.డి.ఆర్.ఎఫ్. ఏ.పి.ఎస్.డి.ఆర్.ఎఫ్., సిటీ సెక్యూరిటీ వింగ్, కమ్యునికేషన్, సైబర్ క్రైమ్, క్రైమ్ స్పాట్, ట్రాఫిక్ గురించి, వాటర్ కెనాన్, వజ్ర, ఫలకాన్ తదితర వాహనాల పాత్ర, పని తీరు గురించి అవగాహన కల్పించారు. డాగ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి విద్యార్థులను అలరించింది. డి.సి.పి.లు గౌతమి షాలి, తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, సిఎస్‌డబ్ల్యూ డిసిపిలు ఏబిటిఎస్ ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడిసిపి ఏ.సి.పి.లు, ఇన్‌స్పెక్టర్లు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వరద సాయం కోసం సిఎంకు వినతి

ప్రజాశక్తి - కంచికచర్ల :

కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామ దళితులు, నిరుపేదలు వరద సహాయం అందలేదని శనివారం మధ్యాహ్నం మంగళగిరిలో టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదలకు మండలంలో చెవిటికల్లు, కునికినపాడు గని ఆత్కూరు, కొత్తపేట, మున్నలూరు, మోగులూరు, వేములపల్లి, ఎస్.అమరవరం, తదితర గ్రామాలు నీట మునిగి 8713 కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారన్నారు. అయితే బాధితులకు పరిహారం అందలేదు. దళితులు, నిరుపేదల నివాస గృహాలు వరదనీటిలో చిక్కుకున్నాయన్నారు. దీంతో శనివారం చెవిటికల్లు గ్రామానికి చెందిన బాధితులు, మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును వరద సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

బుడమేరు వారియర్స్‌కు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రజా వైద్యశాల ఎమ్.డి.డాక్టర్ శ్రావణ కుమార్ సేవలు అనితర సాధ్యమని, ఆయన సేవలు స్వచ్ఛంద సంస్థలు ఆదర్శనీయంగా తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపు నిచ్చారు. వైద్య వృత్తిలో 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా వైద్యశాల ఎమ్.డి డాక్టర్ శ్రావణ కుమార్ శనివారం బుడమేరు వారియర్స్ పేరుతో అన్ని రకాలుగా వరద బాధితులకు సేవలు అందించిన 580 మందికి సత్కారం, ప్రశంసా పత్రాలు అందించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కలరా ఆసుపత్రి సమీపంలోని ఎస్.వి కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా వార్తా ప్రభ దినపత్రిక సంపాదకులు, ఎపిఎంపిఎ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్ బేగ్, సిపిఐ నగర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, వైసిపి నాయకులు పోతిన మహేష్, జనసేన నాయకులు బాడిత శంకర్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ సురేష్ బాబు, బాబు



కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన చిన్నారులు

శ్రీనివాసన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ సిఐ, కొండలరావు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్నారులు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వేంకటేశ్వరరావు, రైల్వే సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ బృందం, ప్రముఖ లేడీ యాంకర్ చంద్రిక, పొలిటికల్ యాంకర్ కత్తెర ప్రదీప్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో 82 స్వచ్ఛంద సేవా సంస్థలు, 580 మంది సేవాతత్పరులు, 15 మంది హైకోర్టు అడ్వకేట్స్, ప్రజావైద్యశాల సిబ్బంది, ఆంధ్రనాట్యం రాయన శ్రీనివాస్ బృందం, కూచిపూడి కుమారి అపర్ణ, డి.టి.ఎస్.ఆనంద్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ టీం.ప్రెసిడెంట్ రూప్‌నాథ్, వారి టీమ్‌నీ సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ చనుమోలు వెంకట్రావు (సివిఆర్) ఫ్లైఓవర్‌పై శుభ్రం చేస్తూ విధుల్లో ఉన్న ఓ పారిశుధ్య కార్మికుడిని వాహనం ఢీ కొనటంతో మృతిచెందిన సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దార ప్రశాంత్ (30) జగుపిళ్ళ రామారావు స్ట్రీట్, చిట్టినగర్, విజయవాడలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. దార ప్రశాంత్ విఎంసిలో స్వీపర్ (పారిశుధ్య) కార్మికునిగా పనిచేస్తుంటాడు. రోజులాగానే శనివారం ఉదయం 5.30 గంటలకు విధులకు వెళ్ళి మిల్క్ ప్రాజెక్ట్ దగ్గర చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ మీద పనిచేస్తూ చెత్త ఎత్తుచుండగా కబేళా సెంటర్ నుండి వైఎస్ఆర్ కాలనీ వైపు వెళ్తున్న ఎపి 16 టిసి 3372 డస్ట్ వాహనం దార ప్రశాంత్‌ను ఢీకొంది. దీంతో అతను క్రిందపడిపోగా వాహనం టైర్ ఎక్కడం తలన తలకు రక్తగాయం కాగా, ఆటోలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్న సమయంలో మృతిచెందినట్లు మృతుడి భార్య దార పండు టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

మరణ వార్త తెలిసిన వెంటనే మున్సిపల్ ఆఫర్స్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు జ్యోతిబస్, సాములు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహానికి నివాళు





మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు (ఇన్‌సెట్‌లో దారా ప్రశాంత్ ఫైల్ ఫొటో

లర్పించారు. బాధిత కుటుంబాన్ని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు పరామర్శించారు. సత్యబాబు మాట్లాడుతూ వారానికి ఒకరు చొప్పున రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కార్మికులు మరణించడం బాధాకరమని ఈ నెలలోనే ఒక వర్కర్ మరణించాడని, ముగ్గురు కార్మికులు గాయపడ్డారని తెలిపారు. ముఖ్యమైన ఫ్లై ఓవర్లు, ప్రధానమైన రోడ్లపై విధులు నిర్వహిస్తున్న కార్మికులకి మున్సిపల్ శాఖ అధికారులు సరైన రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమని తెలిపారు. దారా ప్రశాంత్ కుటుంబానికి రూ.20 లక్షల చెల్లించాలని, పక్కా ఇల్లు ఇవ్వాలని, కుటుంబ సభ్యులకి వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.



మందులు అందజేస్తున్న వైద్యాధికారి శ్వేత

గర్భకోశ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరువూరు : పాడి రైతులు తమ పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వావిలాల పశువుల ఆసుపత్రి వైద్యాధికారి టి.శ్వేత సూచించారు. తిరువూరు మండలంలోని కోకిలంపాడులో శనివారం పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువుల్లో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవులు, గేదెలు గర్భం దాల్చని క్రమంలో తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో 47 పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

లింగాల వద్ద మున్నేరులో ఇసుక తవ్వొద్దు

ప్రజాశక్తి వత్సవాయి : మండలం లింగాల గ్రామ మున్నేరు నదీ పరివాహక ప్రాంతంలో సిపిడబ్ల్యూఎస్ (గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా) పథకం ద్వారా వత్సవాయి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయబడుతుంది. ఆంధ్రప్రదేశ్ వాల్టా చట్టం 2002 నిబంధనలననుసరించి సిపిడబ్ల్యూఎస్ పరిధిలో ఇసుక తవ్వకాలు నిషిద్ధం. అక్కడ ఉచిత ఇసుక పథకంలో భాగంగా కొంతమంది వ్యక్తులు ఇసుక తరలిస్తున్నారని, ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకం వల్ల గ్రామీణ మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, గ్రామీణ మంచినీటి సరఫరా వ్యవస్థ అధికారులు ఆందోళన చెందుతూ, అక్కడ తవ్వకాలు ఆపించాలని కోరుతూ



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వత్సవాయి మండల తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు స్పందించి వాల్టా చట్ట పరిధిలోకి వచ్చే ఆ ప్రాంతంలో ఇసుక తవ్వటం చట్ట విరుద్ధం అని తెలిపారు.



ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల పరిధిలో పేరకలపాడు అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపు శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పేరకలపాడు నుండి కంచికచర్ల వైపు వస్తున్న ట్రాక్టర్‌ను వెనక నుండి వస్తున్న కంటైనర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ గొర్రెపాటి బసవయ్య (35) మృతి చెందాడు. మృతుడు బసవయ్యది విజయవాడ. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కంచికచర్ల ఎస్ఐ రాజు తెలిపారు.

పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ, అంగన్వాడీ సహాయకురాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ కె.పుష్పలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో ప్రేమధార కేంద్రంలో ఎస్‌సిలకు, రెడ్డిగూడెం మండలం బూరుగూడెం బిసి జనరల్, ఇబ్రహీంపట్నం మండలం ముస్లిం ఏరియాలో జనరల్, మూలపాడులో అంగన్వాడీ సహాయకురాలు జనరల్, ఇబ్రహీంపట్నంలోని పుట్టమ్మ గట్టు అంగన్వాడీ సహాయకురాలు బిసిఏ, మైలవరం మండలం గణపవరం2లో అంగన్వాడీ సహాయకురాలు బిసిఎకు కేటాయించబడిందన్నారు. స్థానికురాలై, వివాహిత మహిళా అభ్యర్థులై ఉండాలని, 10వ తరగతి పాసై ఉండాలని, దరఖాస్తు ఫారాలు కార్యాలయంలోనే ఇస్తారని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను నవంబర్ 5వ తేదీ లోపు మైలవరం ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు. మరిన్ని వివరాలు కోసం ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలివ్వాలి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్

ప్రజాశక్తి - భవానీపురం : ప్రతినిత్యం ప్రజలకు– ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్



శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో జగన్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఒక్కొక్కరికి మూడు సెంట్లు ఇళ్ల స్థలాన్ని కేటాయిస్తూ మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారని పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించే విషయంలో కదలిక లేకపోవడం బాధాకరమని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

నవంబర్ 9,10 తేదీల్లో

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు నవంబర్ 9,10 తేదీల్లో గన్నవరం రోటరీ కళ్యాణ మండపంలో జరుగుతాయి. ఆగష్టు 10, 1974న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్-యుటిఎఫ్ సుమారు 3000 సభ్యత్వంతో ఆవిర్భవించి నేటికి లక్ష సభ్యత్వం చేరుకుని 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. ఎంతో మంది నాయకులు, కార్యకర్తల త్యాగాల ఫలితంగా సంఘం దినదిన ప్రవర్ధమానమై ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి కృషి చేస్తూ, ఉపాధ్యాయుల వృత్తిపర, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. ప్రభుత్వాలు ఏవైనా, పాలకులు ఎవరైనా విధానాలు విద్యారంగాన్ని మెరుగుపరచేవైతే సమర్ధించడం, లోపాలుంటే తెలియజేయడం, మార్పులు లేకపోతే ఉద్యమాలు పోరాటాల ద్వారా ప్రయత్నాలు చేసి విద్యారంగాన్ని కాపాడుకోవడానికి అవిరళ కృషి చేస్తుంది. నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయులకు అండగా పోరాటాలు చేస్తూ అనేక నిర్బంధాలను, అరెస్టులు, కేసులు ఎదురైనా ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉండి, సమస్యల సాధన కోసం పోరాడే సంఘంగా ఉన్న యుటిఎఫ్ సంఘ కార్యకర్తగా ఉండటం మనకెంతో గర్వకారణం. నిబద్ధత, త్యాగబుద్ధి గల నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఉండటం యుటిఎఫ్ బలం. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, స్పాట్ బహిష్కరణ కార్యక్రమాలు,ధర్నాలు, అనివార్యమైతే సమ్మెలు చేసి ఎన్నో సమస్యలు పరిష్కారం చేయడం జరిగింది.

రీ గ్రూపింగ్ స్కేల్స్, ఆటోమెటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్, ట్రిపుల్ బెనిఫిట్ స్కీమ్, బదిలీల్లో కౌన్సిలింగ్ విధానం, అప్రెంటీస్ విధానం రద్దు మొదలైన అనేక ఫలితాలను సాధించడం కొన్ని ఉదాహరణలు. సామాజిక స్పహలో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో కరువు సంభవించినపుడు అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి బాధితులను ఆదుకోవడం, రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు కోట్ల రూపాయలు ఉపాధ్యాయుల నుండి విరాళాలు సేకరించి నిత్యావసర సరుకులు అందజేయడం తదితర సహాయకార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆపన్నులను ఆదుకొనేందుకు కషి చేస్తోంది. యుటిఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకుని, స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించుకుంటున్న సందర్భంగా నవంబర్ 9,10 తేదీల్లో గన్నవరంలో జరిగే కష్ణాజిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని యూటీఎఫ్ జిల్లా నేతలు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు పెనమకూరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెనమకూరు విద్యార్థులు జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యా యులు కే. బాలు శనివారం పత్రికా సమావేశంలో తెలిపారు. శుక్రవారం జగ్గయ్యపేటలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ నందు 9వ తరగతికి చెందిన సమ్మంగి భాను ప్రసాద్, ఎనిమిదవ తరగతికి చెందిన వల్లూరు అభిషేక్ పరుగు పందెంలో ప్రథమ స్థానం సంపాదించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాల తరఫున వీరు పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచడానికి ప్రత్యేక శ్రద్ధ వహించిన వ్యాయామ ఉపాధ్యాయులు కే బాలును ప్రధాన ఉపాధ్యాయులు బొప్పన శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది గ్రామ పెద్దలు అభినందించారు.

డిఇఒగా రామారావు బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా విద్యాశాఖా ధికారిగా పివి జె.రామారావు శనివారం విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన విద్యాశాఖ అధికారుల బదిలల్లో బాగంగా కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి విధులు నిర్వహిస్తున్న రామారావును కృష్ణా జిల్లా విద్యాశాఖా ధికారిగా నియమించారు. ఈ నేపథ్యంలో రామారావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామారావును పూర్వ విద్యాశాఖా ధికారి తాహెరా సుల్తానా, పలువురు ఉప,మండల, విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలసి అభినందనలు తెలిపారు.



నూతన డిఇఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తాహెరా సుల్తానా

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : పీఎం శ్రీ పథకంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా బంటుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9,10,వ తరగతి చదువుతున్న విద్యార్థులు స్థానిక సబ్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవికుమార్ సబ్ స్టేషన్ నిర్మాణం, దాని పనితీరు వివిధ ట్రాన్స్ఫార్మర్ల పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు బివి వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అర్జ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు వంశీకృష్ణ, ఒకేషనల్ ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు,రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ వద్ద విద్యార్థులు

అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు : ఎస్‌పి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు అక్రమంగా నిల్వ ఉంచిన, విక్రయించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి ఆర్.గంగాధరరావు స్పష్టం చేశారు. శనివారం ఆయన మచిలీపట్నంలో మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని కొంతమంది అక్రమార్కులు లాభాలను ఆశించి సుదూర ప్రాంతాల నుండి బాణసంచాను కొనుగోలు చేసి నివాస ప్రాంతాలలో నిల్వ చేయడం, కొంతమంది నివాస గహాలనే బాణసంచా తయారీ కేంద్రాలుగా నిర్వహిస్తున్నారన్నారు. బాణసంచాను అనుమతి లేకుండా నిల్వ ఉంచిన, తయారుచేసిన, విక్రయాలు జరిపిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని సూచించారు. బాణసంచాను తయారి, నిల్వలు, విక్రయాలు నిర్వహించేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అగ్నిప్రమాదాలను నిలువరించేందుకు వీలుగా నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని, నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ప్రాచీన కళలను పరిరక్షించాలి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ప్రాచీన భారతీయ కళలను పరిరక్షించుకోవాల్సిన భాద్యత అందరిపైనా ఉందని పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మహ్మద్ అసీఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. మచిలీపట్నంలోని స్థానిక పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయ లో శనివారం బ్యాగ్ రహిత దినోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉదయం దేశీయ జానపద నత్య పోటీలు నిర్వహించారు. ద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశం పై డాక్టర్ పద్మ అవగాహన కల్పించారు. విద్యార్థులకు పళ్ళు తోము కోవడంపై శిక్షణ ఇచ్చారు. అలాగే స్లోగన్ పోటీలు, పోస్టర్ తయారీ పోటీలు క్రికెట్, ఖో ఖో, పరుగు పందెం పోటీలు, విపత్తు నిర్వహణపై ఏ.ఆర్.కే. ప్రసాద్ పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. పని విద్యలో భాగంగా వడ్రంగి పని పై కోటేశ్వరరావు తో అవగాహన కల్పించారు. అలాగే టైలరింగ్ లో విద్యార్థులకు 10 వ తరగతి విద్యార్థి జస్వంత్ తల్లి విజయతో శిక్షణ ఇప్పించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు ఆనందోత్సాహలతో పాల్గొన్నారు.



కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మహ్మద్ అసీఫ్ హుస్సేన్

కెసిపిలో నాణ్యతా దినోత్సవం

ప్రజాశక్తి-ఉయ్యూరు : కేసీపీ షుగర్స్ ప్రథమ చైర్మన్, మేనేజింగ్ డైరెకర్ వెలగపూడి మారుతీరావు 92వ జయంతి పురస్కరించు కుని కర్మాగారం ఆవరణలో శనివారం నాణ్యతా దినోత్సవం నిర్వహిం చారు. కేసీపీ సంస్థల వ్యవస్థా పకుడు వెలగపూడి రామకృష్ణ, వెలగపూడి మారుతీరావు విగ్రహాలకు యూనిట్ హెడ్ వై.సీతారామదాసు పూలమాలలు వేసి ఘనంగా నివా ళులర్పించి కార్మికులతో నాణ్యతదినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ ముందుచూపుతో చక్కెర పరిశ్రమలో ఎన్నో నూతన సాంకేతిక పరిజ్ఞానం,సంస్కరణలు మారుతీరావు తీసుకు వచ్చారని కీర్తించారు. ఈసందర్భంగా 26 మంది కార్మి కులకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.4లక్షల ఆర్థిక సహాయం చెక్కులు అంద చేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, ఉద్యోగులు పాల్గొన్నారు.



కార్మికులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేస్తున్న సీతారామదాసు



అవార్డును పొందిన విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయభాస్కర్ దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక రాజేంద్ర నగర్‌లోని విద్యాలయ స్కూల్‌లో డైరెక్టర్ విజయ భాస్కర్ దంపతులను పలువురు సత్కరించారు. ఇటీవల డాక్టర్ అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం విద్యాలయ స్కూల్‌లో డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ దంపతులను పలువురు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను మానసికంగా చదువు మీద ఆసక్తి పెంపొందేలా బోధన చేసిన విజయభాస్కర్‌కు అవార్డు రావడం గొప్ప విషయమన్నారు. అనంతరం స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది విజయభాస్కర్‌ను దుశ్శాలువా, పూలదండలతో సత్కరించారు.

కెయులో కొత్త హంగులు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో నాక్ బందం పరిశీలన అనంతరం కొన్ని అదనపు హంగులు సమకూరాయి. బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలు గ్రీన్ పార్క్, బయోడైవర్సిటీ పార్క్, ఆక్వా చెరువు,ఆక్వాఫోనిక్ యూనిట్, వర్మి కంపోస్టు కేంద్రంలు ఏర్పాటు చేశారు. వీటి వల్ల విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకుని మరింత విజ్ఞానం పెంచుకుంటారని విభాగ అధిపతి డా ఎల్ సుశీల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బయోటెక్నాలజీ విభాగంలో పని చేస్తున్న ఆచార్య మారుతి, సహ ఆచార్య డాక్టర్ వీర బ్రహ్మాచారి, డాక్టర్ మాధురి. డాక్టర్ సురేష్, డాక్టర్ స్వరూపా, డాక్టర్ కిషోర్ కృషితో వీటిని ఏర్పాటు చేశారు.

వంట పాత్రలు బహూకరణ

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం వీరవల్లి షిరిడి సాయిబాబా ఆలయానికి భక్తులు ఇచ్చిన విరాళాలతో సుమారు 33,500 విలువ గల వంట పాత్రలను అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు కోడేబోయినబాబి తెలిపారు. ఈ కార్యక్రమంలో రావి ఈశ్వర్, తవ్వ ఆదిలక్ష్మి, గుత్త నాగమణి పాల్గొన్నారు.

వీడ్కోలు సభ

ప్రజాశక్తి కలక్టరేట్(కష్ణా) : కృష్ణాజిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు జిల్లా పూర్వ విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీ అయినా తాహెరా సుల్తానా వీడ్కోలు సభ శనివారం ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా తాహెరా సుల్తానా మాట్లాడుతూ తనకు అందించిన సహకారాన్ని నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యాశాఖ అధికారికి కూడా అందించి జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, వీరులపాడు, చందర్లపాడు,పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట, తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాపై విజయవాడ సిపి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్‌లతో డ్రోన్ కెమెరా సహాయంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు సిపి పర్యవేక్షణలో ఇసుక డంపు ఉన్న పరిసరాలను గుర్తించి అక్కడి తహశీల్దార్, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేసి దాని గురించి వివరాలు తెలుసుకునే పనిలో విజయవాడ ఎసిపి మూర్తి ఉన్నారు.

తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - మైలవరం : తెలంగాణ రాష్ట్రం నుండి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఒకరిని శుక్రవారం రాత్రి మండలంలోని మొరుసుమల్లి గ్రామంలో అరెస్ట్ చేసినట్లు మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జి.కొండూరు మండలానికి చెందిన గోపి హోండా యాక్టివ్‌పై ఆరు మద్యం బాటిళ్లను తీసుకొస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎం.దుర్గ ప్రసాద్‌రావు, సిబ్బంది చెన్నకేశవులు, రాజకుమార్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని టి.గన్నవరం వెళ్లే రహదారికి ఇరువైపులా మార్జిన్‌లు కోతకు గురై ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ గ్రామం నుండి మైలవరం, చంద్రాల, విసన్నపేట, నూజివీడు తదితర గ్రామాలకు నిత్యం ఆటోలు ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రైతులు కూడా తమ పంట పొలాల్లోకి ఈ మార్గం ద్వారానే వెళ్లాల్సి ఉంది. ఇటీవల వచ్చిన వరదలకు రహదారికి ఇరువైపులా మార్జిన్‌లు కోతకుగురై అగాధంలా ఏర్పడింది. రాత్రి వేళల్లో గోతులు కనిపించక ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

11న సిపిఎం విస్సన్నపేట మండల మహాసభ



మాట్లాడుతున్న మేకల నాగేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - విస్సన్నపేట : సిపిఎం విస్సన్నపేట ఎనిమిదవ మండల మహా సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, కోట కళ్యాణ్ కోరారు. శనివారం విస్సన్నపేట స్థానిక సుందరయ్య భవనంలో మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, విద్యుత్తు చార్జీలను విరమించుకోవాలని, లేనియెడల విద్యుత్ పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో పర్వతినేని సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా ఆరు నెలలపాటు టైలరింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ శిక్షణ పొందే మహిళలకు ఆరు నెలల పాటు నెలకు రూ.500లు నగదు రూపంలో స్టయిఫండ్ ఇవ్వబడుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9248017133, 9110523520 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రామసభలో 56 అర్జీలు

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని చంద్రాల గ్రామంలో శనివారం నిర్వహించిన రీసర్వే భూ సమస్యల గ్రామసభలో 56 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలకృష్ణారెడ్డి, సర్పంచి జొన్నలగడ్డ జ్యోతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, మాజీ ఎంపిపి జొన్నలగడ్డగంగాధరరావు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



ప్రజాశక్తి - నందిగామ : మున్సిపల్ కమిషనర్ ఇవి రమణ బాబు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయం నుండి రథం సెంటర్ వరకు రోడ్డుకిరువైపుల ఉన్న ఆక్రమణలను సిఐ వైవి.ఎల్.నాయుడు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ పోలీస్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమణాలను తొలగించారు. మున్సిపల్ కార్యాలయం నుండి రథం సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించి తోపుడు బండ్లు విచ్చలవిడిగా పెట్టి అమ్మకాలు జరుపుతున్న వైనం కొన్ని రోజులుగా ట్రాఫిక్ వల్ల వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా రోడ్డు ఆక్రమించి తోపుడు బండ్లు చిన్నచిన్న బడ్డీ కోట్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారని ట్రాఫిక్ సమస్యలు మున్సిపల్ కమిషనర్ దృష్టికి రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు సిఐ వైవి.ఎల్.నాయుడు ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పట్టణంలో రోడ్డుకు ఇరువైపు ఉన్న తోపుడు బండ్లు తొలగించారు. ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని ఆక్రమణలను తొలగిస్తామని పోలీసులు తెలిపారు. ఇకనుండి వ్యాపారాలు ఫ్రూట్ మార్కెట్‌లోనే జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రోడ్డుపై ఎటువంటి వ్యాపారాలు నిర్వహించకూడదని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శాసనమండలిలో పట్టభద్రుల ప్రతినిధిగా మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు పట్టభద్రులైన ప్రతి ఉద్యోగి ఓటు హక్కు నమోదు చేసుకోనేల కృషి చేయాలని, ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి తాలూకా కేంద్రాలను ఎన్జీవో హోమ్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు చేసుకొనుటకు సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, బ్రాకెట్ ఓటర్గా నమోదు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన సహాయక కేంద్రాల ద్వారా పరిష్కారం చేసుకోవాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నమోదు కావాలని కోరారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పశ్చిమ కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం గాంధీనగర్ లోని ఎన్జీవో హోమ్‌లో విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ఫిబ్రవరి లో జరగనున్న కృష్ణా – గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎన్నికలలో మంచి అభ్యర్థిని ఎన్నుకునేందుకు డిగ్రీ ఉత్తీర్ణులైన ప్రతి ఉద్యోగి వారి కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకునేలా కషి చేయాలన్నారు. సమావేశంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రమేష్, బి.సతీష్ కుమార్, ఎం. రాజుబాబు, జి. రామకష్ణ, గోపాలకష్ణ, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సివిఆర్ ప్రసాద్, షేక్. నాజీరుద్దీన్, తదితర కార్యవర్గ సభ్యులు ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహ్మద్ పేట, జగ్గయ్యపేట పట్టణంలో వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయంలో ఓటు నమోదు చేసుకోవాలని కోరుతూ శనివారం దరఖాస్తు ఫారాలను అర్హులైన పట్టభద్రులకు అందజేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక జగ్గయ్యపేట పట్టణంలో వివిధ ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కృష్ణ – గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఎంఎల్‌సి ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. టీచర్స్ కో–ఆపరేటివ్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటు నమోదు జరుగుతుందని ఓటరుగా నమోదు చేసుకునేందుకు 2021 నాటికి గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేసుకున్న వారు అర్హులని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ ప్రణయ్ తేజ, సిఐటియు మండల కార్యదర్శి ఫేక్ గౌస్ మియా, మండల నాయకులు కోట రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న ఎంపి చిన్ని, తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో అధిక స్థాయి టిడిపి సభ్యత్వాలను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. శనివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 48వ డివిజన్‌లో డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో జరిగిన తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పాల్గొని మొదటి సభ్యత్వాన్ని పేరాబత్తుల రమణకు ఇచ్చి సభ్యత్వ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపి శివనాథ్ మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు భారీగా చేసి పశ్చిమ నియోజకవర్గం టిడిపికి కంచుకోట అని నిరూపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, 48వ డివిజన్ టిడిపి అధ్యక్షులు పేరాబత్తుల రమణ మాట్లాడుతూ తమ డివిజన్లో రికార్డు స్థాయిలో తెలుగుదేశం సభ్యత్వాన్ని నమోదు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. టిడిపి నాయకులు ఎం.ఎస్.బేగ్, గురుమూర్తి, కాండ్రేగుల రవీంద్ర, ఉప్పాడి రాము, పిళ్లా వెంకన్న, ఎస్.కె సుభాని, ఎస్. కే.నాగూర్, మహిళా నాయకురాళ్ళు పేరాబత్తుల రాజేశ్వరి, దాసరి నాగమణి పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో టిడిపి సభ్యత్వాన్ని శాసనసభ్యులు తంగిరాల సౌమ్య శనివారం ప్రారంభించారు. **జగ్గయ్యపేట:** మండలంలోని షేర్ మొహమ్మద్ పేట గ్రామంలో టీడీపీ సభ్యత్వాన్ని ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య శనివారం ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ ఫోటోకి పూలమాలవేసి, టిడిపి జెండాని ఆవిష్కరించి టిడిపి సభ్యత్వాన్ని ప్రారంభించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ప్రజాశక్తి - తిరువూరు : ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఎస్ఐ సత్యనారాయణ వాహనదారులకు సూచించారు. తిరువూరు మెయిన్ రోడ్‌లో శనివారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎదురెదురుగా వాహనాలు ఎదురైనప్పుడు లైన్ ప్రకారం వెళ్తే ట్రాఫిక్ సమస్య తలెత్తదని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారి నుండి బయటపడవచ్చని ఎస్ఐ తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన వాహనదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వాహనాలు తనిఖీలు, స్ట్రీట్ వాక్ చేసి పలు వాహనాలకు పెనాల్టీ విధించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి నందిగామ వాస్తవ్యులు తల్లపునేని రాకేష్ చౌదరి, హారిక దంపతులు వారి కుమార్తె గోహిత రెండో జన్మదిన సందర్భంగా రూ.23,600లు విరాళంగా అందజేశారు.

జగ్గయ్యపేట సిఐగా వెంకటేశ్వర్లు బాధ్యతలు



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : స్థానిక సిఐగా పోలాకి వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటే శ్వర్లు గతం లో విజయవాడ 2 టౌన్, 1 టౌన్ కమి షనర్ పిఆర్ ఒగా పనిచేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లా డుతూ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా నేరుగా తనని సంప్రదించవచ్చని అన్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సిఐ ఎం.జానకిరామ్ ఏలూరు రేంజ్ హెడ్ క్వార్టర్‌కి వెళ్లారు.

వార్డ్ కౌన్సిలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని చెరువు బజారు 15వ వార్డు కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ఓసి ద్వారా ఇటివలే మోకాలు ఆపరేషన్ చేయించుకుని హాస్పటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు. విషయం తెలుసు కొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ కౌన్సిలర్ ఇర్రి నరసింహారావు గహానికి వెళ్లి ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

గర్భకోశ వ్యాధులపై పరీక్షలు

ప్రజాశక్తి - గంపలగూడెం : నెమలి పరిధిలో ఉన్న ప్రభుత్వ పశువైద్యశాల ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ అభిలాష్ తెలిపారు. ఇందులో పరీక్షల అనంతరం అవసరమైన మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ శిరీష, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ సదస్సులో 77 అర్జీలు

ప్రజాశక్తి - గంపలగూడెం : శనివారం వినగడపలో జరిగిన రెవెన్యూ సర్వీసులు 77 అర్జీలు వచ్చినట్లు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరభద్రరావు తెలిపారు. మండల వ్యాప్తంగా జరిగిన రీ – సర్వే గ్రామాల్లో అనుకోకుండా మిగిలిపోయిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సుల నిర్వహణ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల లైసెన్స్‌లు పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలో పది షాపులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మినెంట్ లైసెన్స్ మంజూరుకు ఎక్సైజ్ డియస్పి ఆర్.వి.రామారావు శనివారం దుకాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుడి, బడి, హాస్పిటల్ ప్రాంతాలకు మద్యం దుకాణాలకు మద్య వెరిఫికేషన్ చేశారు. ఎక్సైజ్ సిఐ బి.గురవయ్య పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం


కంకిపాడులో సభ్యత్వం అందిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయ ప్రజావేదికలో టిడిపి సభ్యత్వ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు లక్ష రూపాయలు చెల్లించి తొలి శాశ్వత టిడిపి సభ్యత్వాన్ని తీసుకుని సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గుడివాడ నియోజకవర్గంలో 46 వేల సభ్యత్వాలు తీసుకున్నారన్నారు. అదే విధంగా జిల్లాలోనే గుడివాడ సభ్యత్వాల నమోదులో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, గుడివాడ రూరల్, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** పెనమలూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు కార్యకర్త లకు అండగా ఉంటుందన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద 32 చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. **ప్రజాశక్తి-గన్నవరం :** కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అండ అని గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు హరిబాబు , ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సోదరుడు యార్లగడ్డ సతీష్ లు అన్నారు. శనివారం గన్నవరం క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలసి టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్ మద్దుకూరి విజయ్ కుమార్ ఆయన సతీమణి రిటైర్డ్ కాలేజ్ ప్రిన్సిపల్ ఉప్పులూరి స్వర్ణకుమారి ఈచెరో లక్ష రూపాలయలను రాష్ట్ర తెలుగుదేశం పార్టీకి చెల్లించి తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. నాయకులు చిరుమామిళ్ల సూర్యం , ఆళ్ల గోపాల కృష్ణ , గుజ్జర్లపూడి బాబురావు, గూడవల్లి నరసయ్య , గొడ్డళ్ల చినరామారావు , దొంతు చిన్నా, జాస్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని గుడివాడ డివైఈఓ పద్మ రాణి అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని తాడంకి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా దుస్తులను అరిగే ప్రభాకర్‌రావు కుమారుడు అజయ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడంకి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో ఇతర దేశాల్లో ఉన్నారని అన్నారు.విద్యార్థులు కూడా బాగా కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి అండర్-17 కబడ్డీ పోటీలు ఆడనున్న బుల్లెట్ అభినయ్ తేజను అభినందించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు రవీంద్ర, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులు వేగవంతం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇరిగేషన్ శాఖలో చేపట్టిన పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. అవనిగడ్డ సబ్ డివిజన్ జలవనరుల శాఖ నూతన డిఈఈగా బాధ్యతలు చేపట్టిన పులిగడ్డ వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాదును మర్యాదపూ ర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడు ప్రధాన అవుట్ ఫాల్స్ స్లూయిజ్ లు పునర్నిర్మాణానికి రూ 38 కోట్ల 75 లక్షల అంచనాతో పంపిన ప్రతిపాదనలకు పరిపాలనాపరమైన అనుమతుల కు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మిగిలిన ఔట్ ఫాల్స్ స్లూయి జూ ల ఉన్న నిర్మాణానికి ప్రస్తుత మరమ్మతులకు అంచనాలు రూపొందించి అనుమతులకు చర్యలు చేపట్టాలని సూచించారు. కరకట్టలు కాలువ గట్ల అక్రమణాలపై సంబంధిత శాఖలతో కలిసి దష్టి సారించా లని కోరారు. ఏఈలు రామ్ కుమార్, రవితేజ, టీ ప్రసాద్, చిరంజీవి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సభలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో శనివారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రి సర్వే డిటి కె సాయి పాల్గొని భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామసభలో వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే వారి సమస్యలను పరిష్కరిస్తామని సాయి తెలిపారు.గ్రామ సెక్రెటరీ నాగజ్యోతి,వీఆర్వో గణేశ్వరరావు, సర్పంచ్ యక్కల మాధవి నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో భాగంగా మండలంలోని గాదెపూడి గ్రామ సచివాలయం వద్ద గ్రామసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ రీ సర్వేలో వచ్చిన తప్పులుపై రైతులు అర్జి సమర్పిం చుకుంటే సవరణ చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ వీర్నాల లక్ష్మణరావు, మండల సర్వేయర్, విఆర్వో పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని పోలీస్ సొసైటీ ఆధ్వర్యంలో అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో అవనిగడ్డలోని ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ డిగ్రీ కాలేజీ తరపున ఎన్ఎస్ఎస్ యూనిట్ నుంచి 26 మంది విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్పి మురళీధర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ టి ఎస్ ఎస్ బాలాజీ శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్‌విఎల్ కళాశాలల కరస్పాండెంట్ దుట్టా ఉమా మహేశ్వరరావు, సీఐ యువకుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి బవిరి శంకర్నాథ్, ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు ,అవనిగడ్డ కోడూరు ఎస్సైలు కే శ్రీనివాసరావు, చాణిక్య, జనసేన మండల పార్టీ అధ్యక్షు శేషుబాబు పాల్గొన్నారు. 50 మంది యువకులు రక్తదానం చేయగా పట్టాభి రెడ్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు వైద్య సిబ్బంది రక్తాన్ని స్వీకరించారు.

స్వచ్ఛ మచిలీపట్నంలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ మచిలీపట్నం నేపథ్యంలో శనివారం కృష్ణాజిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయంలో ఆవరణ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సిహెచ్ నరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర,జిల్లా కలెక్టర్ డికె బాలాజీ పిలుపు మేరకు స్వచ్ఛత హి 2024 కార్యక్రమం కింద స్వచ్ఛ మచిలీపట్నంలో భాగంగా కార్యాలయ ఆవరణలో శుభ్రం చేశామని, ఈ కార్యక్రమం ప్రతి శనివారం నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.నాని, నాగమణి ,కార్యాలయ సూపర్డెంట్‌లు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఉయ్యూరు : రైతులు,వ్యవసాయం చేసేవారు పశువుల పెంపకం చేపట్టి పశునందను పెంపొందించ వలసిన ఆవశ్యకత ఏర్పడిందని చినఓగిరాల సర్పంచ్ యెనిగళ్ల శిరీష, పశుసంవర్ధక శాఖ ఏడి రామశేఖర్ అన్నారు. భగవాన్ సత్యసాయిబాబా భజనమండలి, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చినఓగిరాల పశు వైద్యశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్యశిబిరాన్ని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరా వుతో కలసి ప్రారంభించారు. 22 పశువులకు గర్భకోశ చికిత్సలు, 50 సాధారణ చికిత్సలు చేసి, 27 పశువులకు నట్టల నివారణ మందులు అందచేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు సీతారామస్వామి, పశువైద్యులు శ్రీకాంత్, డి, వీణ, వేణు, సిబ్బంది మీగడ శ్రీని వాస్, సత్యసాయి సేవాసంస్థల సభ్యులు లీలకష్ణ, చంద్రశేఖర్ పాల్గొని సేవలందించారు.

పాలాభిషేకం

ప్రజాశక్తి-పమిడిముక్కల :నాయి బ్రాహ్మణు లకు అన్ని దేవాలయాలలో సముచిత స్థానం కల్పించిన ప్రభుత్వానికి బీసీలందరూ రుణపడి ఉంటారని నాయి బ్రాహ్మణ జిల్లా సంఘం అధ్యక్షులు ఆమదాలపల్లి గోపాలకృష్ణ అన్నారు. శనివారం పామర్రులో చంద్రబాబు చిత్రపటానికి పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వీరంకి గురుమూర్తి, గాలిపరిచి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రేపు యుటిఎఫ్ మండల మహాసభ

ప్రజాశక్తి-గన్నవరం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గన్నవరం మండలం మహాసభ సోమవారం బాలురు ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతుందని మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొట్టం రవిబాబు , రాజబాబు తెలిపారు. సాయం త్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే మహాసభలో ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్సీ బి. నాగేశ్వర రావు, అతిథులుగా యూటీ ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు నీలం ప్రభాకర్, జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, రాష్ట్ర నాయకులు కె.భగీరధి తదితరులు హాజరవుతారని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు,కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జనగణన చేపట్టాలి : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా గణనను పక్కనపెట్టి ప్రభుత్వాలు పశుగణనతో కాలక్షేపం చేయడం ఏమిటని వైసీపీ అవనిగడ్డ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. శనివారం అవనిగడ్డలోని ప్రెస్ క్లబ్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2010లో జరిగిన జనగణన ఆధారంగా నేటికీ పంచాయతీలకు కేంద్రం నిధులు కేటాయింపు జరుగుతోందని, దీని కారణంగా పంచాయతీలకు కేంద్రం నుంచి అందే సాయం కేవలం అరకొరగానే అందుతుందన్నారు. పశుగణనకు తాము వ్యతిరేకము కాదని ఆ ఘనత వల్ల పశు పోష కులకు ఏమైనా ప్రయోజనం ఉంటే తాము ఆహ్వానిస్తామని కానీ జనాభా లెక్కలు లేకపోవడంతో పంచాయతీల్లో పారిశుద్యానికి ప్రజా ఆరోగ్యాన్ని అందించాల్సిన నిధులు అందకుండా పోతున్నా యన్నారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం కూడా జనాభా లెక్కలు తీసి ప్రజా ఆరోగ్యానికి పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'విజయక్రాంతి'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : కష్టపడితే ఉత్తమ ఫలితాలు సాధ్యమని అవనిగడ్డ డిఎస్‌పి మురళీధర్ అన్నారు. స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పట్టుదల కషి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యపడుతుందని విద్యార్థులకు సూచిం చారు. ఒక గమ్యం నిర్దేశించుకొని విద్యార్థులు పయనిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి సిఐ కె ఈశ్వరరావు, మండల పరిషత్ అధ్యక్షురాలు కోట విజయ రాధిక, చల్లపల్లి సర్పంచ్ పైడిపా ముల కష్ణకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో వివిఐపిఎస్ చాప్టర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఫార్మసీ కళాశాలలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫారమ్ వివిఐపీఎస్ చాప్టర్‌ను శనివారం ప్రారంభిం చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐపిఎ మాజీ అధ్యక్షులు డాక్టర్ టీవీ నారాయణ, గౌరవ అతిధి ఎడిటర్, ఇండియా జనరల్ ఆఫ్ ఫార్మసిటికల్ డాక్టర్ ఎస్ విద్యాదర, విష్టతి అతిథిగా ఐపిఎపీ సెక్రెటరీ డాక్టర్ ఎం ప్రసాదరావు, డాక్టర్ కే వెంకటరమణ, సి ఎస్ సభ్యులు, ఐ పిఎ వ్యవహరించారు. ఐ పి ఏ గుడ్లవల్లేరు శాఖను ప్రారంభించాక ఈ శాఖ తరపున ఎన్నో కార్యక్రమాలను, ఈ సందర్భంగా ముఖ్య అతిధి డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఇండియన్ ఫార్మసిటికల్ అసోసియేషన్ అనేది జాతీయంగా గుర్తింపబడిన సంస్థ అని, 1939 నుండి ఫార్మసీ రంగం అభివద్ధికి పాటుపడుతూ వస్తుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ఐపిఎ ఫ్రెండ్స్ ఫారమ్‌ను ఆవిర్భ వించారని తెలిపారు. అనంతరం ఐపిఎ స్టూడెంట్ ఫోరమ్ జాతీయ ప్రెసిడెంట్ ఏ వంశీకష్ణ, గుడ్లవల్లేరు స్టూడెంట్ ఫోరమ్ సభ్యులను వేదిక పెద్దలంతా ఐటిఐ-ఎస్ ఎఫ్ గుడ్లవల్లేరు లోగోను ఆవిష్కరించారు. గుడ్లవ ల్లేరు శాఖ ఐపిఎ అధ్యక్షులు డాక్టర్ పి రవీష, వైస్ ప్రెసి డెంట్ కె పరిమిళ, కార్యదర్శి ఏ సాయి ధాత్రి, సభ్యులు ఎస్ కె నాగూర్, మీరావలి, అధ్యాపకులు పాల్గొన్నారు.




తాడిగడపలో అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కొందరు అక్రమ కట్టడాల నిర్మాణాలు చేపడుతున్నారు. బందర్ రోడ్డు పవర్ వన్ మాల్ పక్కన నాయకుల అండ చూసుకొని అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. పేదవాడు గుడిసె వేయా లంటే ఆంక్షలు విధించే అధికారులు పరపతి ఉన్న నాయకులు ఏం చేసినా చూసి చూడనట్టు ఉంటు న్నారని పలువురు అంటు న్నారు. అధికారుల తీరుతో ప్రభుత్వ అదాయానికి భారీ గండి పెట్టే విధంగా అధికా రులు ప్రవర్తిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.


పవర్ వన్ మాల్ పక్కన నిర్మిస్తున్న కట్టడం

డాక్టర్ వేణుగోపాలరెడ్డికి సిఎం ప్రశంస



సిఎం నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న డాక్టర్ వేణుగోపాల్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజిఆర్ డయాబెటిస్ ఎడ్యుకేషనల్ అండ్ అవేర్‌నెస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్ర మాలకు గానూ ప్రశంసా పత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కొండా వేణుగోపాలరెడ్డి శుక్రవారం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాలరెడ్డి సమాజానికి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. సంస్థ తరుపున పర్యావరణాన్ని కాపాడేందుకు 50 వేల మొక్కలను పంపిణీ చేయడాన్ని అభినందిస్తూ డాక్టర్ వేణుగోపాలరెడ్డిని సిఎం చంద్రబాబు కొనియాడారు. మధుమేహ వ్యాధి నియంత్రణ, నివారణకు సంబంధించి 10 లక్షల మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించడం ముదావహమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజిఆర్ డయాబెటిస్ అట్లాస్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు డాక్టర్ విజిఆర్ అందజేశారు. డయాబెటీస్ పట్ల అవగాహన కల్పిస్తూ రూపొందించిన పుస్తకాలను దాదాపు 8 లక్షల కాపీలను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్ని వర్గాల వారికి ఉచితంగా అందజేసినట్లు డాక్టర్ విజిఆర్ తెలిపారు.

పశుగణన కిట్లు అందజేత

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో అఖిల భారత జాతీయ పశుగణన ప్రారంభమైందని నందిగామ డివిజనల్ పశు సంవర్ధక శాఖ డిడి.డాక్టర్.మోసెస్ వెస్లి తెలిపారు. పశుగణన కర్తలకు సహాయ కిట్లు అందజేశారు. నందిగామ డివిజనల్ పశు సంవర్ధక శాఖ డిడి. డాక్టర్ మోసెస్ వెస్లీ ఆధ్వర్యంలో అఖిలభారత జాతీయ పశుగణన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిడి. డాక్టర్ మోసెస్ వెస్లీ మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జాతీయ పశు సంవర్ధక శాఖ వారు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ వారితో అనుసంధానం చేసుకుని ప్రతి గ్రామంలో పశు గణన 2024 అక్టోబర్ – 25 నుండి 2025 ఫిబ్రవరి – 28వ తేదీ వరకు 4 నెలల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. గేదెలు, ఆవులు,మేకలు, గొర్రెలు, ఇలా 16 రకాల పశువులు , జీవాల సంఖ్యను లెక్కించి సంబందిత యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఎడి డాక్టర్ వెంగళరావు, ఏడి. డాక్టర్ కృష్ణమూర్తి, వి.ఎ.యస్.డాక్టర్. ప్రదీప్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండల పరిధిలోని అన్నేరావుపేట గ్రామ పంచాయతీలో అన్నేరావుపేట తండా వారు నిర్వహించు వాలీబాల్ టోర్నమెంట్ శనివారం సాయంత్రం తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దబాబు) రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులకు సహకారం అందించే దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత విజయవాడ పార్లమెంటు నాయకులు పైడిమర్ల కిరణ్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు చిట్టేటి కృష్ణ, నరెడ్ల బాలకష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

చిరు వ్యాపారుల ఉపాధిపై పిడుగు

పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్లు చిరు వ్యాపారుల (హాకర్స్)పై రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అత్యంత దారుణంగా, కర్కోటకంగా వ్యవహరిస్తున్నారు. వారి జీవనోపాధిపై దెబ్బకొడుతున్నారు. ఎవరూ లేని సమయంలో అర్ధరాత్రి, తెల్లవారు జామున పలు శాఖల అధికారులు, పోలీసులు పెద్ద ఎత్తున చేరి మూకుమ్మడిగా దాడి చేసినట్లుగా నిమిషాల వ్యవధిలోనే హాకర్స్‌కు సంబంధించిన విలువైన సరుకును, బండ్లను అక్కడి నుంచి పొక్లెయిన్ల సాయంతో తొలగిస్తూ వేరే ప్రాంతంలో పడేస్తున్నారు. దీని వల్ల చిరు వ్యాపారుల జీవనోపాధి దెబ్బతినడంతో పాటు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. ఇటువంటి వ్యవహారమే శుక్రవారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో సెంట్రల్ నియోజకవర్గంలోని లెనిన్ సెంటర్‌లో చోటు చేసుకుంది. విజయవాడ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, వారి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున లెనిన్ సెంటర్‌లో మోహరించి, వెనుకా ముందు ఆలోచించకుండా పొక్లెైన్, ఇతర వాహనాలతో బడ్డీ కొట్లను ధ్వంసం చేసి, లక్షలాది రూపాయల విలువైన సరుకును కూడా నష్టపరిచి, వాటిని అక్కడి నుంచి హనుమాన్‌పేటలోని సచివాలయం వద్ద డంపింగ్ యార్డులో గుట్టలుగా పడేశారు. ఆయాశాఖలకు సంబంధించి సుమారు 200 మంది లెనిన్ సెంటర్‌కు తెల్లవారుజామున చేరుకొని చిరు వ్యాపారాలపై దెబ్బకొట్టారు. సుమారు 100 మందికి పైగా పోలీసులు మోహరించారు. మూడు జెసిబిలు, 10 ట్రాక్టర్లు, వ్యాన్లు, ఫైరింజన్, ఇలా అనేక వాహనాలను అక్కడికి తీసుకొచ్చి, బడ్డీ కొట్లను నేల మట్టం చేయడం, వాటిల్లో ఉన్న వివిధ రకాల సరుకును సైతం చిందర వందరగా చేసి, దేనికీ పనికి రాకుండా వేరే చోటకు తరలించారు. ఆయా చిరు వ్యాపారాలకు సంబంధించిన సుమారు 70 షాపులను నేలమట్టం చేసి, భారీ స్థాయిలో నష్టపరిచినట్లు బాధిత చిరు వ్యాపారులు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెడీమేడ్ బట్టలకు సంబంధించిన 15 కొట్లు, ఫ్యాన్సీకి సంబంధించి ఆరు కొట్లు, బట్టలకు సంబంధించి 15 కొట్లు, బెల్టులకు సంబంధించి ఒకటి, పూలకొట్లు ఆరు,టీ స్టాల్స్ రెండు, బొప్పాయి బండ్లు రెండు, టిఫన్ బండ్లు ఐదు,

వీక్షణం

చెరుకు రసంబండ్లు నాలుగు, తదితర అన్ని రకాల స్టాల్స్‌ను ధ్వంసం చేసి, వాటిల్లో ఉన్న సరుకును కూడా దేనికీ పనికి రాకుండా చేశారు. దెబ్బతిన్న వీటి మొత్తం విలువ సుమారు రూ.70 లక్షలకు పైగా ఉంటుందని బాధిత చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఏళ్ల తరబడి లెనిన్ సెంటర్‌లోనే చిరువ్యాపారం చేసుకుంటూ, జీవనోపాధి పొందుతున్న తాటి లక్ష్మీ తాయారమ్మకు చెందిన రూ. లక్ష విలువ చేసే స్టీల్ బడ్డీ కొట్టు, రూ. 40 వేలు విలువ చేసే ఫ్రిజ్‌ను అధికారులు ధ్వంసం చేశారని, తమకు జీవనోపాధి పోయినట్లేనని బాధితులురాలు కన్నీటి పర్యంతమయింది. రూ.70 వేలు చేసే రెండు మిషన్లు దెబ్బతిన్నాయని, 10 విద్యుత్ మీటర్లను ధ్వంసం చేసినట్లు హాకర్స్ తెలిపారు. తెల్లవారి వచ్చి చూసుకునే సరికి ఏమి మిగలలేదని బాధితులు కె గోపి, కె.చిన్న, టి.వినోద్ బాబు, సిహెచ్.మురళి, ఎస్.వెంకటరమణ, షేక్ ఖతీజాబి తదితరులు వారికి జరిగిన నష్టాన్ని తెలుపుతూ వాపోయారు. తాను 20 సంవత్సరాల వయస్సు దగ్గర నుంచి ఇక్కడే పూలు అమ్ముకుంటూ తన పిల్లలను బతికించుకున్నానని, అధికారులు చేసిన పనికి జీవనోపాధి పోయిందని, తాను ఎలా బతకాలని, ఎప్పుడు ఇటువంటి దౌర్జన్యం చూడలేదనీ మహిళ కన్నీటి పర్యంతమయింది. జీవనోపాధిని దెబ్బతీసేలా వ్యవహరించారని సిటీ హాకర్స్‌యూనియన్ నగర కార్యదర్శి సిహెచ్ మురళీ, నాయకులు వై సుబ్బారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్ల నుంచి లెనిన్ సెంటర్ ఏరియాలో చిరు వ్యాపారులు ఏదో ఒక చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని, కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి స్థానిక ఎమ్మెల్యేలు, పలువురు కార్పొరేటర్లు అత్యంత క్రూరంగా, దారుణంగా వ్యవహరిస్తూ చిరు వ్యాపారులపై వారి ప్రతాపాన్ని చూపిస్తున్నారని యూనియన్ నేతలు మండిపడుతున్నారు. మధురానగర్, బుడమేరు దగ్గర, సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్, వన్‌టౌన్ తదితర ఏరియాల్లోని ఏళ్ల తరబడి ఉంటున్న హాకర్స్‌ను నిర్ధాక్షణ్యంగా పోలీసుల నిర్బంధం మధ్య పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తొలగించిన ఘటనలు కూడా తీవ్ర దుమారాన్ని రేపాయి.

సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా...

నగరాలు, పట్టణాల్లో ఎక్కడయితే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ చిరు వ్యాపారులు (హాకర్స్) జీవనోపాధి పొందుతున్నారో అటువంటి చోట్ల వారికి భద్రత కల్పించి, గుర్తింపుకార్డులు మంజూరు చేసి, లోను సదుపాయంతో పాటు వారికి అన్ని విధాలుగా ప్రభుత్వాలు అండగా నిలవాలని స్వయంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఈ నాటి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారు.

- వి.హెచ్.ఆర్

కఠోర శ్రమతో విజయ సాధన

నున్నలో స్కూల్ గేమ్స్ సైక్లింగ్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు చదువులోనూ, ఆటల్లోనూ, జీవితంలోనూ ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే ముఖ్యంగా వారికి కఠోర ప్రాక్టీస్ అవసరమని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు) సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగ మోహనరావు సూచించారు. నిరంతరం సాధన చేయడం ఒక్కటే విజయానికి తొలి చిహ్నామని పేర్కొన్నారు. క్రీడలలో సాధించే విజయాలు, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఉమ్మడి కృష్ణా (కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలు), ఆంధ్రప్రదేశ్ యూనిట్‌ల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల అండర్ – 14, 17, 19 బాల బాలికల సైక్లింగ్ టోర్నమెంట్‌ను పవర్‌గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ నాగమోహనరావు నున్నలోని ఆరు వరుసల జాతీయ రహదారి బైపాస్‌పై శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 300 మంది సైక్లిస్టులు, అఫిషియల్స్ ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. సైక్లింగ్‌లో రెండు కేటగిరిలలో పోటీలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాగ మోహనరావు మాట్లాడుతూ ఎవరికైనా క్రీడలతోనే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. నున్న జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల జడ్‌పిటిసి సభ్యుడు కె.సువర్ణరాజు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) సైక్లింగ్ కోచ్, టోర్నమెంట్ పరిశీలకుడు వి.కనకారావు, మరో పరిశీలకుడు బి.కోటేశ్వరరావు, సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె సుగుణరావు, ఎస్ఎంసి చైర్మన్ జి.కుమార్, వైస్ చైర్‌పర్సన్ వీరవనిత గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గంపా శ్రీనివాసరావు యాదవ్, వల్లూరి శివ, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు నరెడ్ల సత్యనారాయణరెడ్డి, గుంటక శివశేషిరెడ్డి (బాబు), మాదు శివరామ్ ప్రసాద్ దితరులు పాల్గొన్నారు. సైక్లింగ్ పోటీల నిర్వహణకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు, మెఘా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులతోపాటు నున్న రూరల్, కొత్తపేట, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు ఆ రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు.

తొలి రోజు కృష్ణా జిల్లాకు రెండు బంగారు పతకాలు

స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలలో తొలి రోజున కృష్ణాజిల్లా జట్టు రెండు బంగారు పతకాలు సాధించింది. అండర్ – 14 బాలికల విభాగంలో కృష్ణాజిల్లాకు చెందిన వి.వెన్నెల టైమ్ ట్రైల్ విభాగంలో బంగారు పతకం సాధించగా, బాలుర విభాగంలో కె.చరణ్ బంగారు పతకం సాధించాడు. ఒక రజతం, ఒక కాంస్య పతకం కృష్ణా జిల్లా సైక్లిస్టులు కైవసం చేసుకున్నారు. **అండర్ - 14 బాలుర టైమ్ ట్రైల్ :** 1. కెచరణ్, పీ అభిరామ్, పి చిన్న అయ్యప్ప, మాస్ స్టార్ట్ : అవినాష్, నారాయణరావు, శివసాయి సిద్దార్థ రెడ్డి. **బాలికలు టైమ్ ట్రైల్ :** వి.వెన్నెల, బి.హేమలత, పి.చైతన్య వేణి, మాస్ స్టార్ట్ : కె మాధురి, జోషిక, ప్రణతి. **అండర్ - 17 బాలుర టైమ్ ట్రైల్ :** వి విఘ్నేష్, జీ మేఘాశ్యామ్, వి సాయివర్ధన్. **అండర్ - 19 బాలుర టైమ్ ట్రైల్ :** ఎస్‌కె మహ్మద్ రఫీ, కె తేజ జశ్వంత్, డి రామ్ చంద్ శ్రీ ఈశ్వర్.

డ్రోన్ విజన్‌లో ఐఓ టెక్ వరల్డ్ ఏవిగేషన్ కీలక పాత్ర

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

డ్రోన్ టెక్నాలజీ రంగంలో అగ్రగామిగా ఉన్న ఐఓ టెక్ వరల్డ్ ఏవిగేషన్ సంస్థ ఆంధ్ర ప్రదేశ్ డ్రోన్ పాలసీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన సంస్థల్లో స్థానం సంపాదించింది. తమ ఐఓ టెక్ వరల్డ్ ఏవిగేషన్ షార్ట్‌లిస్ట్ చేయబడినందుకు గర్వంగా ఉందని ఆ సంస్థ ప్రతినిధి రాజేష్.ఐ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఓ టెక్ వరల్డ్ ఏవిగేషన్ సంస్థ అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో దాని నైపుణ్యం, వినూత్న పరిష్కారాలను తెరపైకి తెస్తుందని పేర్కొన్నారు. డ్రోన్ పరిశ్రమలో ప్రముఖ ఆవిష్కర్తగా ఐఓ టెక్ వరల్డ్ ఏవిగేషన్ నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి అద్భుతమైన డ్రోన్ పాలసీ కార్యక్రమం కోసం తన షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించినందుకు ఆనందంగా ఉందన్నారు. భారత డ్రోన్ పర్యావరణ వ్యవస్థను వేగంగా మారుస్తున్న డ్రోన్ సిస్టమ్ డిజైన్, తయారీ (డీఎస్ డీఎం), డ్రోన్–ఎనేబుల్డ్ టెక్నాలజీ, సర్వీసెస్ (డిఇటిఎస్)లో కంపెనీ మార్గదర్శక ప్రయత్నాలకు ఈ ముఖ్యమైన గుర్తింపుకి నిదర్శనం ఈ ఎంపిక అన్నారు. డ్రోన్ సిస్టమ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ అలాగే డ్రోన్–ఎనేబుల్డ్ టెక్నాలజీ సర్వీసెస్‌లో అగ్రగామిగా నిలవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహసోపేతమైన ప్రగతిని సాధిస్తోందని, వ్యవసాయం నుండి రక్షణ, లాజిస్టిక్స్, అర్బన్ మొబిలిటీ వరకు ఉన్న రంగాలకు దోహదం చేస్తూ డ్రోన్ ఆవిష్కరణ ఉత్పత్తికి భారతదేశాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చాలనే భారత ప్రభుత్వ దార్శనికతతో ఈ చొరవ చాలా దగ్గరగా ఉందని చెప్పారు. విధాన సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా డ్రోన్ సాంకేతికతను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను నొక్కి చెబుతుందని, ఐఓ టెక్ వరల్డ్ ఏవిగేషన్ షార్ట్‌లిస్టింగ్ పరిశ్రమల అంతటా డ్రోన్ స్వీకరణ, ఆవిష్కరణలను వేగవంతం చేయాలనే కంపెనీ దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.